ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

బాపట్ల జిల్లా వార్తలు

బుధవారం 27 మార్చి 2024





కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం




నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి




చాపలమడుగు రామయ్య చౌదరి



కాసు బ్రహ్మానందరెడ్డి



దొండేటి కృష్ణారెడ్డి



డాక్టర్ కోడెల శివప్రసాదరావు




కాసు వెంకట కృష్ణారెడ్డి



డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ఉద్దండుల కోట.. నరసరావుపేట



రాజకీయాలకు రాజధాని, కళలకు కాణాచి, ఉద్యమాలకు ఊపిరి, సాహిత్యానికి సాగర సంగమం... ఇలా నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. ఫ్యాక్షన్ రాజకీయాలకు, బాంబుల సంస్కృతికి, కులాల పోరుకు కొన్నేళ్లు వేదికగా నిలిచింది. రాష్ట్రంలోనే కాక దేశంలోనే ఒక విశిష్టమైన స్థానాన్ని సొంతం చేసుకుంది. ఇలాంటి గుర్తింపును రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి తీసుకువచ్చారు. దేశంలోనే అనేక ఉన్నత పదవులు అలకరించిన కాసు బ్రహ్మానందరెడ్డి ఇక్కడి నుంచే రాజకీయాలను శాసించారు. రాజకీయ ఉద్దండులకు నరసరావుపేట నిలయం. ఇక్కడినుంచి శాసన సభ్యులుగా గెలుపొందిన వారిలో ముగ్గురు మినహా మిగిలిన నేతలందరూ అత్యున్నత పదవులను అలంకరించటం విశేషం. వరుసగా ఐదుసార్లు కోడెల శివప్రసాదరావు విజయం సాధించారు. మూడు సార్లు ఇక్కడినుంచి ఎమ్మెల్యేగా కాసు వెంకట కృష్ణారెడ్డి గెలుపొందారు. ఆంధ్రరాష్ట్ర తొలి స్పీకరుగా నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి, రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాసు బ్రహ్మానందరెడ్డి, నవ్యాంధ్ర తొలి శాసన సభాపతిగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు, మంత్రిగా కాసు వెంకట కృష్ణారెడ్డిలు పని చేయటంతో ఈ నియోజకవర్గం ప్రత్యేకత సంతరించుకుంది.

- ఎమ్మెల్యేలుగా ఎన్నికైంది ఏడుగురే..!
- ముఖ్యమంత్రి.. కేంద్రమంత్రి.. గవర్నర్‌గా కాసు బ్రహ్మానందరెడ్డి
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి స్పీకరుగా నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి
- నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్‌గా డాక్టర్ కోడెల శివప్రసాదరావు
- వరుసగా ఐదుసార్లు గెలిచిన కోడెల
- మూడు సార్లు అసెంబ్లీకి వెళ్ళిన కాసు

ఓటర్లు

మొత్తం ఓట్లు	:	2,29,533
పురుషులు	:	1,11,756
మహిళలు	:	1,17,748
థర్డ్ జండర్	:	29

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాకు గుంటూరు కేంద్రం అయినప్పటికీ రాజకీయాలకు కేంద్రంగా నరసరావుపేట భాసిల్లింది. 1952లో ఈ నియోజక వర్గం ఏర్పడింది. ఇప్పటికి 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఏడుగురు అభ్యర్థులు మాత్రమే ఇప్పటివ రకు ఎన్నిక కావటం విశేషం. 1952కు ముందు నరసరావుపేట నియోజకవర్గం విను కొండ, మాచర్ల, గురజాల నియోజకవర్గాలతో కలసి వుండేది. నరసరావుపేట కేంద్రంగా ఏర్పాటైన అసెంబ్లీ నియోజకవర్గంలో 2006లో జరిగిన పునర్విభజన అనంతరం మునిసిపాలిటీతో పాటు రొంపిచర్ల, నరసరావుపేట రూరల్ మండలాలు వున్నాయి.

తొలి ఎన్నికలో..

1952లో జరిగిన తొలి ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి సోదరుడు కాసు వెంగళరెడ్డిపై కేఎంపీ పార్టీ తరఫున నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి గెలుపొందారు. నల్లపాటి ఆంధ్ర రాష్ట్ర తొలి స్పీకరుగా పనిచేశారు. 1955లో నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి సీపీఐ అభ్యర్థి కె.రంగారావుపై వరుసగా రెండవ సారి విజయం సాధించారు. 1962లో చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలేనికి చెందిన చాపలమడుగు రామయ్య చౌదరి గెలుపొందారు. ఆయన తొలి పార్లమెంట్‌కు నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయ్యారు. 1967లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర్య పార్టీ అభ్యర్థి కొత్తూరి వెంకటేశ్వర్లుపై మాజీ సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి విజయం సాధించారు. కొత్తూరు వెంకటేశ్వర్లు 1962, 1967, 1972 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా, 1978 ఎన్నికల్లో జనతా పార్టీ అభ్యర్థిగా వరుసగా నాలుగు సార్లు పోటీ చేసి ఓటమి చెందారు.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో..

1983 వరకు నరసరావుపేట నియోజక వర్గం కాసు వంశానికి కంచుకోటగా వుంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో కాసు కోటకు బీటలు వారాయి. ఎన్‌టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి నరసరావుపేట నుంచి విజయం సాధించారు. అప్పటి నుంచి 1999 వరకు వరుసగా ఐదుసార్లు కోడెల విజయకేతనం ఎగుర వేశారు. 2004, 2009లో జరిగిన ఎన్నికల్లో కాసు వెంకట కృష్ణారెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి తెలుగుదేశం అభ్యర్థి కోడెలపై వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పొత్తుతో బీజేపీ ఇక్కడ పోటీ చేసింది. బీజేపీ అభ్యర్థి డాక్టర్ నలబోతు వెంకటరావుపై వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శాసన సభ్యుడిగా విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వరుసగా రెండోసారి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే 32,277ఓట్ల మెజార్టీతో రికార్డు నెలకొల్పారు. ఇప్పటివరకు ఇదే అత్యధిక మెజార్టీ కావడం విశేషం. నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేలుగా నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. చాపలమడుగు రామయ్య చౌదరి, దొండేటి కృష్ణారెడ్డి వీరు ఒక్కసారి మాత్రమే శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు.

నియోజకవర్గ చరిత్ర

సంవత్సరం	విజేత	పార్టీ	రన్నరప్	పార్టీ	ఆధిక్యం
1952	నల్లపాటి వెంకట్రామయ్య	కేఎంపీపీ	కేవీరెడ్డి	కాంగ్రెస్	4,574
1955	నల్లపాటి వెంకట్రామయ్య	కాంగ్రెస్	కే రంగారావు	సీపీఐ	12,063
1962	చాపలమడుగు రామయ్యచౌదరి	కాంగ్రెస్	కొత్తూరి వెంకటేశ్వర్లు	స్వతంత్ర	2,656
1967	కాసు బ్రహ్మానందరెడ్డి	కాంగ్రెస్	కొత్తూరి వెంకటేశ్వర్లు	స్వతంత్ర	13,699
1972	దొండేటి కృష్ణారెడ్డి	కాంగ్రెస్	కొత్తూరి వెంకటేశ్వర్లు	స్వతంత్ర	14,587
1978	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	కొత్తూరి వెంకటేశ్వర్లు	జనత	6,905
1983	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	బీ సుబ్బారెడ్డి	కాంగ్రెస్	14,557
1985	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	2,064
1989	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	ఎం రాధాకృష్ణమూర్తి	కాంగ్రెస్	9,155
1994	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	దొడ్డా బాలకోటిరెడ్డి	కాంగ్రెస్	9,300
1999	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	14,306
2004	కాసు వెంకటకృష్ణారెడ్డి	కాంగ్రెస్	కోడెల శివప్రసాదరావు	టీడీపీ	15,495
2009	కాసు వెంకటకృష్ణారెడ్డి	కాంగ్రెస్	కోడెల శివప్రసాదరావు	టీడీపీ	5,971
2014	డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి	వైసీపీ	నలబోతు వెంకటరావు	బీజేపీ	15,766
2019	డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి	వైసీపీ	చదలవాడ అరవిందబాబు	టీడీపీ	32,277

విశిష్టత..

నియోజక వర్గానికి రాజకీయ ఖిల్లాగా పేరుంది. మల్రాజు వంశస్థులు ఇక్కడ జమిందారులుగా వున్నారు. 1797 నుంచి నరసరావుపేట కేంద్రంగా జమీందారుల పరిపాలన కొనసాగింది. 1952 వరకు ఇక్కడ పరిపాలన అంతా జమిందారుల చేతు ల్లోనే వుండేది. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి రాజకీయాలకు వేదికగా మారింది. స్వాతంత్రోద్యమంలో త్రివేణి పత్రికను నిర్వహించి కోలవెన్ను రామకోటేశ్వరరావు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయాల్లో కాసు వెంగళరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి, కాసు వెంకట కృష్ణారెడ్డి, డాక్టర్ కోడెల శివప్రసాదరావులు రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన నాయకులు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం అనంతరం నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందింది. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి ఆలయం రాష్ట్ర ప్రసిద్ధి చెందింది. కోటప్పకొండ శైవక్షేత్రం అసాధారణ అభివృద్ధి చెందింది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ కోటప్పకొండకు ఘాట్‌రోడ్డుకు శ్రీకారం చుట్టారు. సీఎంగా చంద్రబాబు హయాంలో ఘాట్‌రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభించారు. శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవాలయం పునర్‌నిర్మాణం చేశారు. కోటప్పకొండ అభివృద్ధికి డాక్టర్ కోడెల శివప్రసాదరావు విశేషంగా కృషి చేశారు. పర్యాటక కేంద్రంగా కూడా గుర్తింపు వుంది. కోటప్పకొండ తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పించేందుకు కాసు వెంకటకృష్ణారెడ్డి కృషి చేశారు. నరసరావుపేట పట్టణ రక్షిత మంచినీటి పథకం దేశంలోనే అరుదైనది. రూపాయి ఖర్చు లేకుండా విద్యుతుతో పనిలేకుండా పట్టణానికి రెండు పూటలా తాగునీటిని అందిస్తున్న ఘనత పథకం సొంతం. పూర్తిగా గ్రావిటీపై నీటి సరఫరా జరుగుతుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వేసవిలో కూడా రెండు పూటలా నరసరావుపేటలో మంచి నీటి సరఫరా జరుగుతుండటం విశేషం.

నియోజకవర్గ ముఖచిత్రం



దేశ రాజకీయాలను శాసించిన 'కాసు'

నరసరావుపేట నుంచి కాసు బ్రహ్మానందరెడ్డి దేశ రాజకీయాలను శాసించారు. మారుమూల గ్రామమైన నాదెండ్ల మండలం తూబాడు రైతు కుటుంబంలో జన్మించిన కాసు బ్రహ్మానందరెడ్డి అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగానే కాక కేంద్రంలో సైతం ఎన్నో ప్రతిష్టాత్మక పదవులు అలంకరించారు. చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చిన ఘనత బ్రహ్మానందరెడ్డిది. జాతీయోద్యమం కాలంలో జిల్లాలో జరిగే ప్రతి ప్రతి కార్యక్రమంలో ముందుడేవారు. సత్యాగ్రహ ఉద్యమం సందర్భంగా నాలుగు నెలలు బ్రహ్మానందరెడ్డి కారాగార శిక్ష అనుభవించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పనిచేసి జైలులో 1945 జనవరి వరకు ఉన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ ప్రధాన పాత్ర పోషించి లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాని కావటానికి కారకులయ్యారు. 1956లో రాష్ట్ర ఆర్థికశాఖ బాధ్యతను చేపట్టారు. బ్రహ్మానందరెడ్డి ఆ తర్వాత రాష్ట్రముఖ్య మంత్రి అయ్యారు. రాష్ట్ర మూడో ముఖ్యమంత్రిగా 1964 ఫిబ్రవరి 23న ప్రమాణ స్వీకారం చేశారు. 1971 సెప్టెంబరు 2 వరకు సీఎంగా కొనసాగారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బ్రహ్మానందరెడ్డి రికార్డును అధిగమించారు. ఆవుదూడ గుర్తుతో 1978 ఎన్నికల్లో రాష్ట్రంలో బ్రహ్మానందరెడ్డి పార్టీ పోటీ చేసింది. 30 అసెంబ్లీ స్థానాలను గెల్చుకొంది. అనంతరం ఇందిర, బ్రహ్మానందరెడ్డి కాంగ్రెస్ పార్టీలు విలీనం అయ్యాయి. కేంద్ర ప్రభుత్వంలో కమ్యూనికేషన్లు, హోంశాఖ, పరిశ్రమల శాఖలను సమర్థంగా నిర్వహించారు. ఆయన ఆయా శాఖలకు మంత్రిగా ఉన్న కాలంలో అనేక సంస్కరణలు చేపట్టారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేశారు. నాగార్జున సాగర్ క్రస్ట్ గేట్ల నిర్మాణానికి వ్యవసాయ అభివృద్ధికి కృషిచేశారు. నరసరావుపేట పట్టణ ప్రజలకు మొదటిసారిగా రక్షిత మంచి నీటి పథకం చేపట్టి రక్షిత నీటిని అందించిన ఘనత ఆయనకు దక్కింది. 1994 మే 20న ఆయన మృతిచెందారు.

కోడెల 'కోట'

నరసరావుపేట నియోజకవర్గంలో మంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు సుస్థిర స్థానాన్ని సంపాదించారు. రెండు దశాబ్దాలకుపైగా ఇక్కడ కోడెల హవా కొనసాగింది. పట్టణంలో వైద్యవృత్తిలో ఉన్న కోడెల.. ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయ రంగప్రవేశం చేశారు. 1983 వరకు కాసు వంశానికి నరసరావుపేట కంచుకోటగా ఉంది. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో కోడెల పోటీచేసి విజయం సాధించారు. అప్పటినుంచి నరసరావుపేట కోడెల కోటగా మారిపోయింది. వరుసగా ఐదు సార్లు గెలుపొందారు. మంత్రిగా ఐదు క్యాబినెట్ శాఖలు సమర్థంగా నిర్వహించారు. 1987లో హోంమంత్రిగా తొలిసారి మంత్రి పదవిని చేపట్టారు. 1995లో భారీ, మధ్యతరహా నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. 1996లో మంత్రివర్గ మార్పుల్లో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా 1999వరకు కొనసాగారు. 2001లో తిరిగి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2002లో జరిగిన మంత్రివర్గ మార్పులు చేర్పుల్లో కోడెల వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో ఆరవసారి ఎమ్మెల్యేగా సత్తెనపల్లి నుంచి గెలుపొంది నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్‌గా పనిచేశారు. నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధిలో ఆయనది చెరగని ముద్ర. కోడెల అంటే అభివృద్ధి.. అభివృద్ధి అంటే కోడెల అన్నంతగా గుర్తింపు పొందారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కోడెల రక్షితత మంచినీటి పథకాన్ని విస్తరింపచేశారు. అయన కృషి ఫలితంగా పట్టణంలో రెండు పూటలా నీటి సరఫరా జరుగుతోంది. పట్టణ రూపురేఖలు మార్చిన ఘనత అయనది. పట్టణంలో రోడ్లు విస్తరణ, నూతన రహదారుల నిర్మాణం, క్రీడా ప్రాంగణం, సాంస్కృతిక కేంద్రం భువన చంద్ర టౌన్ హాలు, రోడ్ల విద్యుదీకరణ, పార్కుల నిర్మాణం, షాదీఖానా, స్కూల్ భవనాలు, తదితర పనులను పూర్తి చేయడంలో కోడెల కీలక పాత్ర పోషిం చారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో విస్తృతంగా అభివృద్ధి చేశారు. 2019 సెప్టెంబర్ 16న ఆయన మృతి చెందారు.

నియోజక వర్గ స్వభావం..

ఇక్కడ జరిగే ఎన్నికల్లో పట్టణ ఓటర్ల తీర్పుపై అభ్యర్థుల గెలుపు ఓటములు ఆధారపడి వుంటాయి. పట్టణ ఓటర్ల కంటే గ్రామాలలో ఓటర్ల సంఖ్య అధికం. గ్రామాలు పార్టీల వారీగా విభజించబడి వున్నాయి. రాజకీయ సమీకరణల వారీగా గ్రామాల్లో ఓట్లు పోలవుతాయి. ఈ నేపథ్యంలో పట్టణవాసులు తీసుకొనే నిర్ణయం పైనే అభ్యర్థుల విజయం ఆధారపడి వుంది.

మళ్లీ డాక్టర్ల మధ్యే పోటీ

నరసరావుపేట అసెంబ్లీ స్థానానికి ఇరువురు డాక్టర్లు ఎన్నికల బరిలో దిగారు. తెలుగుదేశం అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తలపడుతున్నారు. వీరు ఇరువురు 2019 ఎన్నికల్లో పోటీ చేశారు. చదలవాడపై గోపిరెడ్డి గెలుపొందారు. మరోసారి వీరు ఇద్దరు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఓటమి చెందిన అరవిందబాబుకు నియోజకవర్గ ఓటర్ల నుంచి సానుభూతి లభిస్తోంది. ఇరువురి మధ్య పోరు పోటాపోటీగా సాగుతోంది. తనకు ఒక ఛాన్స్ ఇవ్వాలని ఓటర్లుకు అరవిందబాబు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూడుసార్లు ఎమ్మెల్యేగా కాసు కృష్ణారెడ్డి..

1978లో జరిగిన ఎన్నికల్లో రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కాసు వెంకట కృష్ణారెడ్డి ఆవుదూడ గుర్తుపై గెలుపొందారు. రాష్ట్రమంత్రిగా పనిచేశారు. 1985, 1999 ఎన్నికల్లో పరాజయం పాలైన కాసు, 2004, 2009లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నరరావుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కృష్ణారెడ్డి రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, తూనికలు, కొలతలు, పౌర సంబంధాల శాఖ, రాష్ట్ర సహకార శాఖ మంత్రిగా కాసు పని చేశారు. కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో విస్తృతంగా కాసు అభివృద్ధి పనులు చేపట్టారు. నరసరావుపేట నుంచి కాసుకు కుటుంబానికి చెందిన ముగ్గురు నేతలు పోటీ చేశారు. కాసు బ్రహ్మానందరెడ్డి, అయన సోదరుడు కాసు వెంగళరెడ్డి, వెంగళరెడ్డి కుమారుడు కాసు వెంకట కృష్ణారెడ్డి పోటీ చేశారు. వెంగళరెడ్డి ఓటమి చెందారు. ఈ కుటుంబానికి చెందిన మూడవ తరం కృష్ణారెడ్డి కుమారుడు కాసు మహేష్‌రెడ్డికి గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీచేసే అవకాశం దక్కకపోవడంతో అయన గురజాల నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

నరసరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో కులాల వారీగా ఓట్ల వివరాలు

కులం	మునిసిపాల్టీ	నరసరావుపేట రూరల్	రొంపిచర్ల	మొత్తంఓట్లు
కమ్మ	7,242	11,801	8,771	27,314
రెడ్డి	6,409	8,689	12,395	27,493
ముస్లీం	17,943	8,653	1,940	28,536
కాపు	15,474	4,615	2,874	22,963
మాదిగ	7,285	8,480	5,390	21,075
మాల	3,754	7,694	4,565	16,013
వడ్డెర	8,776	4,121	3,781	16,678
వైశ్య	13,543	785	778	15,106
యాదవ	3,085	4,380	2,955	10,420
రజక	2,022	2,520	1,795	6,337
ముదిరాజ్	2,035	3,049	521	5,605
ఎరుకల	1,485	1,775	1,177	4,387
యానాది	1,840	825	1,230	3,895
బ్రాహ్మణ	2,620	465	365	3,450
నాయి బ్రాహ్మణ	1,879	818	130	2,875
తొగటి	1,905	202	285	2,392
విశ్వ బ్రాహ్మణ	1,687	260	315	2,262
పద్మశాలి	1,630	85	34	1,749
ఆరెమరాట	1,445	16	29	1,490

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(బుధవారం)

సహారీ (ఉదయం) 4.50 (గురువారం)

అక్రమ కేసులతో వేధింపులు

- బల్లికురవ ఎస్ఐపై ఎస్పీకి బాధితుల ఫిర్యాదు

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పాలకపార్టీకి కొమ్ముకాస్తూ తప్పుడు కేసులతో తమను బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డి వేధిస్తున్నారని మండల పరిధిలోని ఉప్పుమాగులూరుకు చెందిన గ్రామస్థులు మంగళవారం ఎస్పీ వకుల్‌జిందాల్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ మద్దతుదారులే లక్ష్యంగా ఎస్ఐ కేసుల పర్వం నడుస్తోందని బాధితులు ఆరోపించారు. ఇటీవల వేమవరం నాలుగురోడ్ల కూడలి వద్ద ఘర్షణకు సంబంధించి ఎలాంటి విచారణ జరపకుండానే హత్యాయత్నం కేసు నమోదు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివాదానికి కారణమైన గోపిరాజుపై నామమాత్రపు కేసుతో సరిపెట్టిన పోలీసులు అతడి ఫిర్యాదు మేరకు టీడీపీ నేత నాగరాజు సహా మరో ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఘటనతో ఎలాంటి సంబధం లేని గ్రామంలో ఉండని వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశారని ఎస్పీ దృష్టికి బాధితులు తీసుకెళ్లారు. అక్కడి సీసీ పుటేజ్‌ను పరిశీలిస్తే ఆ గొడవలో ఉన్నవారెవరో తెలుస్తోందని ఆ దిశగా విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బాధితుల కుటుంబ సభ్యులు ఎస్పీని కోరారు.

వివాదస్పదంగా ఎస్ఐ తీరు...

అధికారపార్టీ కార్యకర్తలాగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఎస్ఐ నాగశివారెడ్డిపై వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల మద్యం అమ్మకాలు సాగిస్తున్నాడనే నెపంతో టీడీపీ మద్దతుదారుడైన ఓ వృద్ధుడిపై చేయిచేసుకున్న ఘటన మొదలుకుని వైసీపీ నేతతో సన్మానం వరకు ఇలా వరుసగా ఆయన వ్యవహారశైలిపై ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే ఉప్పుమాగులూరుకు చెందిన గ్రామస్థులు ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు చేయడం చర్చకు దారితీసింది.



ఎస్ఐపై ఫిర్యాదు చేయడానికి ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన మహిళలు

అతిసార.. కలకలం

- తూర్పు పిన్నిబోయనవారిపాలెంలో విజృంభించిన డయేరియా
- 20మందిని గుర్తించిన వైద్యులు



ఇంటింటా తిరిగి రోగుల పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్న వైద్యసిబ్బంది

బాపట్ల, మార్చి 26: బాపట్ల మండలం తూర్పు పిన్నిబోయనవారి పాలెం గ్రామంలో డయేరియా విజృంభించింది. ఇప్పటికే 20మందికి పైగా డయేరియా బారినపడి అల్లాడి పోతున్నారు. కొంతమంది ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరికొందరు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ పర్యవేక్షణలో అప్పికట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉస్మాన్ వైద్యబృందం, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటా తిరిగి డయేరియా భారీన పడినవారి వివరాలను సేకరిస్తున్నారు. తాగునీటి శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. తాగునీటి పంపుల పక్కనే క్షీణించిన పారిశుధ్యం కారణంగా కూడా డయేరియా ప్రబలిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కలుషిత నీరు, ఆహారం తీసుకోవటం వల్ల విరోచనాలు సంభవించాయని పలువురు పేర్కొంటున్నారు .

గ్రామంలో వైద్యశిబిరం..

రెండు రోజులుగా గ్రామంలో వైద్యశిబిరం నిర్వహిస్తూ వైద్యసేవలందిస్తున్నారు. అయినప్పటికి అదుపులోకి రాలేదు. మంగళవారం కూడా మరో నలుగురికి విరోచనాలు అవ్వటంతో ఆసుపత్రికి తరలించారు. పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు గ్రామంలో వైద్యశిబిరం కొనసాగిస్తామని డాక్టర్ ఉస్మాన్ తెలిపారు. తాగునీటి శాంపిల్స్ పరీక్షించిన తర్వాత దీనికి గల కారణాలను వివరిస్తామన్నారు. రైతులు పొలాలకు వెళ్ళి ఎండలో పనిచేస్తూ కలుషిత ఆహార పదార్థాలు తీసుకోవటం వల్ల కూడా వ్యాపించి ఉండవచ్చు అంటున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, జిల్లా మలేరియాధికారి వై.రాజకుమార్, కమ్యూనిటిహెల్త్ ఆఫీసర్ సువర్ణకుమారి, రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు పల్నాటి శ్రీరాములు, స్టాలిన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వాణిసుమన్విత, వైద్యసిబ్బంది దుర్గమ్మ, రత్నశేఖర్, షకీల్, శ్రీనివాసరావు, శ్రావణి, తిరుపతమ్మ, కోటమ్మ తదితరులు సేవలందిస్తున్నారు.

నాలుగు రోజుల క్రితం వృద్ధురాలు మృతి

గ్రామంలో నాలుగు రోజుల క్రితం శతాధిక వృద్ధురాలు మృతి చెందింది. అంత్యక్రియలలో పాల్గొని వచ్చిన వారిలో కొంతమందికి విరోచనాలు కావటంతో గ్రామస్తులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి పథకం లేదు..

బాపట్ల పట్టణంలో విలీనం చేసిన గ్రామ పంచాయతీల జాబితాలో తూర్పు పిన్నిబోయనవారిపాలెం కూడా ఉండటం వల్ల ఇక్కడ ఎన్నికలు జరగలేదు. దీనివల్ల 15వ ఆర్థిక సంఘ నిధులు రాకుండా పోయాయి. ఫలితంగా తాగునీటి పథకం మూలనపడింది. దీంతో గ్రామస్తులంతా చేతిపంపులతో బోరువాటర్, ప్లాంట్‌లు నుంచి వచ్చే మినరల్‌వాటర్ తాగుతున్నారు. నాలుగేళ్లుగా గ్రామంలో ఇదే పరిస్థితి. పారిశుధ్య పనులు చేసేవారికి ఇంటిపన్ను ద్వారా వచ్చే డబ్బులే వేతనాలు కూడా చెల్లించాల్సిన పరిస్థితి.



తూర్పుపిన్నిబోయన వారిపాలెం గ్రామంలో తాగునీటి శాంపిల్స్ సేకరిస్తున్న వైద్యబృందం



ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులు.

యాక్షన్ ప్యాక్డ్ షెడ్యూల్‌లో మిస్టర్ బచ్చన్



రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో తెరకెక్కుతోన్న మూడో చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్‌తో సునా హోగా' అనేది ఉపశీర్షిక. భాగ్యశ్రీ బోర్సే ఇందులో హీరోయిన్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా యాక్షన్ ప్యాక్డ్ షెడ్యూల్ లక్నోలో మొదలైంది. ఈ కీలక షెడ్యూల్‌లో పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించనున్నారు. ఈ యాక్షన్ బ్లాక్స్ చిత్రానికే హైలెట్‌గా ఉండబోతున్నాయి. మునుపెన్నడూ చూడని సరికొత్త రవితేజను ఇందులో చూపించబోతున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. ఈ చిత్రానికి నిర్మాత: టీజీ విశ్వ ప్రసాద్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎడిటింగ్: ఉజ్వల్ కులకర్ణి, డీఓపీ: అయనంక బోస్, సంగీతం: మిక్కీ జే మేయర్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాశ్ కొల్లా.

150 థియేటర్లలో జరగండి పాట



రామ్‌చరణ్, తమిళ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్‌రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని అనౌన్స్ చేసిన రోజు నుంచే భారీ అంచనాలు ఏర్పడి, రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూస్తామా అనే ఆసక్తి చాలా మందిలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా రామ్‌చరణ్‌కు ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని 'గేమ్ ఛేంజర్' చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకనిర్మాతలు. బుధవారం రామ్‌చరణ్ పుట్టిన రోజు కావడంతో ఈ సినిమా నుంచి 'జరగండి' అనే పాటను విడుదల చేస్తున్నారు. 150 థియేటర్లలో ఈ పాటను ప్రత్యేకంగా ప్రదర్శిస్తుండడం విశేషం. సంగీత దర్శకుడు తమన్ ఈ సినిమాకు సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. కియారా అద్వాణి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్.జె.సూర్య సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కార్తిక్ సుబ్బరాజు అందించిన కథకు సాయిమాధవ్ బుర్రా మాటలు రాశారు. తిరుణ్ణావుక్కరసు ఛాయాగ్రాహకుడు.

రాముడి కోసం రెడీ అవుతున్న రణ్‌బీర్



బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి పాత్ర కోసం మానసికంగా, శారీరకంగా సిద్ధమవుతున్నారు. శ్రీరాముడు బాణం వేసి శత్రువుల్ని మట్టుపెట్టడంలో ఆరితేరిన వ్యక్తి కనుక రణ్‌బీర్ ఇప్పుడు విలువిద్య మీద దృష్టి పెట్టారు. విలువిద్యలో ఆయన శిక్షణ పొందుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అలాగే శారీరకంగా మరింత ధృడంగా కనిపించడం కోసం ఎక్కువ సమయం జిమ్‌లోనే గడుపుతున్నారు. 'రామాయణ్' షూటింగ్ ఎప్పుడు మొదలవుతుంది, ఎవరెవరు ఏ ఏ పాత్రలు పోషిస్తున్నారనే అధికారిక సమాచారాన్ని శ్రీరామ నవమి సందర్భంగా ఏప్రిల్ 17న దర్శకుడు నితిశ్ తివారి వెల్లడించనున్నారు. ఒక అద్భుతమైన దృశ్య కావ్యంగా ఈ చిత్రాన్ని రూపొందించడం కోసం నితిశ్, ఆయన టీమ్ ఐదేళ్లుగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేస్తోంది. ఎటువంటి విమర్శలకు తావు లేకుండా స్క్రిప్ట్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే విజువల్ ఎఫెక్ట్ అత్యద్భుతంగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. సీతగా సాయిపల్లవి, రావణునిగా యశ్ నటించే 'రామాయణ్' చిత్రం 2025 దీపావళికి విడుదల అవుతుంది.

హాట్‌గా కనిపించడం కష్టమే!



'ప్రేమం'తో కుర్రకారు మతిపోగొట్టి.. గర్ల్ నెక్ట్ డోర్ పాత్రలతో మెప్పించారు క్యూట్ బ్యూటీ అనుపమా పరమేశ్వరన్. ప్రస్తుతం ఆమె 'టిల్లు స్క్వేర్' చిత్రంలో హాట్‌హాట్‌గా కనిపించడం టాక్ ఆఫ్ ది టౌన్ అయ్యింది. ఈ నెల 29న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆమె ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో లిల్లీ పాత్ర గురించి మాట్లాడారు. లిల్లీ పాత్రలో చాలా లేయర్స్ ఉంటాయి. ఈ సినిమాలో నేను వేసుకున్న డ్రెస్సులు రియల్ లైఫ్‌లో అస్సలు వేసుకోలేను. స్ర్కీన్‌పైన హాట్‌గా కనిపించాలంటే ఎంత కష్టమో ఈ చిత్రంతోనే తెలిసొచ్చింది. ఇప్పటివరకూ పక్కింటి అమ్మాయి పాత్రలు చేసే నేను ఒక్కసారిగా ఇలా గ్లామరస్ రోల్ చేయడంతో చాలా మంది ఆశ్చర్యపోయారు. ఇప్పటివరకూ ఇలాంటి రోల్స్ చేసిన హీరోయిన్స్‌ను మెచ్చుకోవాల్సిందే" అని చెప్పారు.

పిల్లల్ని ఎలా పెంచాలో చూపించాం



'అల్లంత దూరాన', 'కళా పోషకులు', 'జై సేన' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు చేరువయ్యారు యంగ్ హీరో విశ్వ కార్తికేయ. ప్రస్తుతం ఆయన నటించిన 'కలియుగం పట్టణంలో' చిత్రం ఈ నెల 29న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా విశ్వ కార్తికేయ, మంగళవారం మీడియాతో ఈ చిత్రం గురించి పలు ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు.

"ప్రతీ ఒక్కరిలో వివిధ రకాల షేడ్స్ ఉంటాయి. వాటిని చూపించేలా ఈ చిత్రం ఉంటుంది. ఛాలెంజింగ్ రోల్స్ చేయాలని అనుకుంటున్న సమయంలోనే నేను ఈ కథ విన్నాను. దర్శకుడు రమాకాంత్ రెడ్డి ఈ కథ చెప్పిన విధానానికి ఆశ్చర్యపోయాను. క్లైమాక్స్ వరకు ఏం జరుగుతుందో కనిపెట్టలేకపోయాను. ఈ సినిమాలో ప్రతీ పాత్రను దర్శకుడు చక్కగా మలిచారు. ఈ చిత్రం సస్పెన్స్ థ్రిల్లర్. ఇందులో ఉన్న మదర్ సెంటిమెంట్ ప్రేక్షకుల్ని భావోద్వేగానికి గురిచేస్తుంది. ఈ చిత్రం నా కెరీర్‌లోనే ఎంతో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ సినిమాలో సమాజంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, పిల్లల్ని తల్లిదండ్రులు సరిగ్గా పెంచకపోతే ఎలా ఉంటుందో చూపించాం" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/Ki0UPLq లో చదవండి.



కోడింగ్ డీకోడింగ్

దిక్సూచి DIKSUCHI
పోటీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

1. ఒక సంకేత భాషలో LOVEను DTLHగా రాసిన అదే సంకేత భాషలో PONDను ఏ విధంగా రాస్తారు?
ఎ) LCLL బి) CLLL
సి) LLLC డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ:

12 15 22 5 — 4 20 12 8
L O V E - D T L H
(-1, -2, -3, -4)

ఇదే విధంగా

16 15 14 4 — 3 12 12 12
P O N D - C L L L
(-1, -2, -3, -4)

గా రాస్తారు.

గమనిక:- పై వివరణ పరిశీలిస్తే LOVE అనే పదంలో చివరి అక్షరం E నుంచి మొదటి అక్షరం L వరకు (చివరి నుంచి మొదటికి) -1, -2, -3 -4 అనే క్రమపద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.)

2. ఒక కోడ్ భాషలో ROUNDను NODRUగా రాసిన అదే కోడ్ భాషలో READYను ఏ విధంగా రాస్తారు?
ఎ) DEYAR బి) DEYRA
సి) YADER డి) EDRAY

సమాధానం: (బి)

వివరణ: ROUND అనే పదంలోని అక్షరాల స్థానాలు మారాయి. (జంబ్లింగ్ అయినవి) పదంలోని అక్షరాలపై వరుస సంఖ్యలను రాసుకొని ఏ విధంగా స్థానాలు మారాయో గమనించి అదే పదతిలో మార్చి రాయాలి.

1 2 3 4 5 — 4 2 5 1 3
R O U N D — N O D R U

ఇదే విధంగా

1 2 3 4 5 — 4 2 5 1 3
R E A D Y — D E Y R Aగా రాస్తారు.

3. ఒక కోడ్ భాషలో PONDను QRFPగా రాస్తే అదే కోడ్ భాషలో IDEAను ఏ విధంగా రాస్తారు?
ఎ) FKCG బి) FCGK
సి) CFKG డి) FGKC


సమాధానం: (ఎ)

వివరణ: POND అనే పదంలోని అక్షరాలను +2 చేయగా RQPF. ఇప్పుడు దీనిలోని ప్రతి రెండు అక్షరాలు తిప్పిరాయగా QRFPగా కోడ్ చేశారు. అదే విధంగా IDEA అనే పదంలోని అక్షరాలను +2 చేయగా KFGC. ఇప్పుడు దీనిలోని ప్రతి రెండు అక్షరాలను తిప్పి రాయగా FKCG సమాధానం అవుతుంది.

16 15 14 4 — 9 4 5 1
P O N D — I D E A
(+2 +2 +2 +2) ఇదే విధంగా (+2 +2 +2 +2)
Q R F P — F K C G
17 18 6 16 — 6 11 3 7

గా రాస్తారు.

గమనిక: పదాలను పైన, కింద ఇచ్చిన అంకెలను పరిశీలిస్తే క్రాస్‌గా +2 పద్ధతిని అనుసరించిందని తెలుస్తోంది.



4. ఒక కోడ్ భాషలో JOKEను NIDJగా రాసిన అదే కోడ్ భాషలో NIKEను ఏ విధంగా రాస్తారు?
ఎ) HMJD బి)MDJH సి) HMDJ డి) JODL

సమాధానం: (సి)

వివరణ:

10 15 11 5 — 14 9 11 5
J O K E ఇదే విధంగా N I K E
(-1 -1 -1 -1)
N I D J — H M D J
14 9 4 10 — 8 13 4 10

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే క్రాస్‌గా -1 పద్ధతిని అనుసరిస్తున్నదని తెలుస్తున్నది.

5. ఒక కోడ్ భాషలో POLICEను NQRGEKగా రాశారు. అదే కోడ్ భాషలో ORANGE ఏ విధంగా రాస్తారు?
ఎ) CTQGIP బి) CQTPIG
సి) QTCPIG డి) CTGQPI

సమాధానం: (ఎ)

వివరణ: POLICE అనే పదంలోని అక్షరాలను +2 చేయగా RQNKEG ఇప్పుడు మొదటి సగం అక్షరాలను, రెండో సగం అక్షరాలను అవే స్థానాలలో తిప్పి రాయగా NQRGEK. అదేవిధంగా ORANGE అనే పదంలోని అక్షరాలను +2 చేయగా QTCPIG ఇప్పుడు మొదటి సగం అక్షరాలను, రెండో సగం అక్షరాలను అవే స్థానాలలో తిప్పి రాయగా CTQGIP సమాధానం అవుతుంది.

16 15 12 9 3 5 — 15 18 1 14 7 5
P O L I C E — O R A N G E
+2 +2 +2 +2 +2 +2 ఇదే విధంగా +2 +2 +2 +2 +2 +2
N Q R G E K — C T Q G I P
14 17 18 7 5 11 — 3 20 17 7 9 16

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన అంకెలను గీతల ఆధారంగా జాగ్రత్తగా పరిశీలిస్తే +2 పద్ధతిని అనుసరించిందని తెలుస్తోంది.

6. ఒక కోడ్ భాషలో FAMOUSను PWVGCPగా రాశారు. అదే కోడ్ భాషలో MOBILEను ఏవిధంగా రాస్తారు?
ఎ) JHQNNE బి) QJENNH
సి) JNHNQE డి) JNNHEQ

సమాధానం: (సి)

వివరణ:

6 1 13 15 21 19 — 13 15 2 9 12 5
F A M O U S ఇదే విధంగా M O B I L E
+1 +2 +3 +1 +2 +3 — +1 +2 +3 +1 +2 +3
P W V G C P — J N H N Q E
16 23 22 7 2 16 — 10 14 8 14 17 5

గా రాస్తారు.

జాగ్రత్తగా క్రాస్‌లైన్ గమనించండి. క్రాస్‌లైన్‌కు పైన, కింద ఇచ్చిన సంఖ్యలు +1, +2, +3, +1, +2, +3లో ఉన్నాయి. (లేదా)

FAMOUS అనే పదంలోని అక్షరాలను ముందుగా +1, +2, +3, +1, +2, +3గా రాయగా GCPPWV అవుతుంది. దీనిలో ఎడమవైపు అర్ధ భాగంలోని అక్షరాలను (GCP) కుడివైపు అర్ధభాగంలో, కుడివైపు అర్ధభాగంలోని అక్షరాలను (PWV)ఎడమవైపు అర్ధభాగంలో రాయగా PWVGCP అవుతుంది. ఇదేవిధంగా పదం MOBILEలోని అక్షరాలను +1, +2, +3, +1, +2, +3లో రాయగా NQEJNH దీనిలో ఎడమవైపు అర్ధభాగంలోని అక్షరాలు (NQE) కుడివైపు అర్ధభాగంలో, కుడివైపు అర్ధభాగంలోని అక్షరాలు (JNH) ఎడమ వైపు అర్ధభాగంలో రాయగా JNHNQE సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

7. ఒక కోడ్ భాషలో MISTAKEను SAMKIETగా రాస్తే అదే కోడ్ భాషలో PRIVATEను ఏవిధంగా రాస్తారు?
ఎ) IAPTREV బి) APTIRVE
సి) IAPRTVE డి) IATPREV

సమాధానం: (ఎ)

వివరణ: MISTAKE అనే పదంలోని అక్షరాల స్థానాలు మారాయి. (జంబ్లింగ్ అయినవి) పదంలోని అక్షరాలపై వరుస సంఖ్యలను రాసుకొని ఏ విధంగా స్థానాలు మారాయో గమనించి అదే పద్ధతిలో మార్చి రాయాలి.

1 2 3 4 5 6 7 — 3 5 1 6 2 7 4
M I S T A K E — S A M K I E T

ఇదే విధంగా

1 2 3 4 5 6 7 — 3 5 1 6 2 7 4
P R I V A T E — I A P T R E V

గా రాస్తారు.

8. ఒక కోడ్ భాషలో POLICEను ECILOPగా రాస్తే అదే కోడ్ భాషలో CINEMAను ఏవిధంగా రాస్తారు?
ఎ) AMENIC బి) NEACIM
సి) AMNIEC డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: POLICE అనే పదంలోని అన్ని అక్షరాలను తిప్పిరాయగా ECILOP. అదే విధంగా CINEMA అనే పదంలోని అన్ని అక్షరాలను తిప్పి రాయగా AMENIC సమాధానం అవుతుంది.

9. ఒక కోడ్ భాషలో LONGERను OLGNREగా రాశారు. అయితే అదే కోడ్ భాషలో NATIVEను ఏవిధంగా రాస్తారు?
ఎ) ANTIEV బి) NATVEI
సి) ANITEV డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: LONGER అనే పదంలో మొదటి రెండు అక్షరాలు తిప్పిరాయగా OL, తదుపరి 3, 4 అక్షరాలు తిప్పిరాయగా GN, ఆ తరవాత చివరి రెండు అక్షరాలు తిప్పిరాయగా RE అనగా పదంలో ప్రతి రెండు అక్షరాలు తిప్పి రాయడమైనది. ఈ విధంగా LONGER అనే పదం OLGNREగా మారింది. ఇదే విధంగా NATIVE అనే పదంలో మొదటి రెండు అక్షరాలు తిప్పిరాయగా AN, తదుపరి 3, 4 అక్షరాలు తిప్పిరాయగా IT. ఆ తరవాత చివరి రెండు అక్షరాలు తిప్పిరాయగా EV, కావున సమాధానం ANITEV అవుతుంది.

జిప్‌మ్యాట్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)- 'జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (జిప్‌మ్యాట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ఐఐఎం బోధ్ గయ, ఐఐఎం జమ్మూ ఉమ్మడిగా అందిస్తున్న ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం)లో ప్రవేశాలు కల్పిస్తారు. దీని వ్యవధి అయిదేళ్లు. ఇందులో లాంగ్వేజ్ స్కిల్స్, ఓరల్ కమ్యూనికేషన్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు సంబంధించిన ఫౌండేషనల్ సబ్జెక్టులు, ఎథికల్ అండర్‌స్టాండింగ్ అంశాలు బోధిస్తారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూపులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.

జిప్‌మ్యాట్ వివరాలు: దీనిని సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 33, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 33, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 34 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2000; ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **జిప్‌మ్యాట్ 2024 తేదీ:** జూన్ 6
- **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/JIPMAT/

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/eTGmYu6లో చదవండి.





చంద్రబాబు పర్యటనలో మార్పులు

రేపల్లె, మార్చి 26: ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 31వతేదీ రేపల్లె పట్టణంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బహిరంగ సభలో పాల్గొంటారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఒంగోలు నుంచి హెలికాప్టర్‌లో పెనుమూడి సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగి ర్యాలీగా పట్టణంలోకి వచ్చి ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభలో పాల్గొని విజయవంతం చెయ్యాలని ఆయన కోరారు.

సీఐ చిన్న మల్లయ్యపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, మార్చి26: వైసీపీ తొత్తులా వ్యవహరిస్తున్న సీఐ చిన్నమల్లయ్యపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కారంపూడి కొత్త బస్టాండ్ వద్ద టీస్టాల్‌లో టీడీపీ నాయకులు టీ తాగుతుండగా సీఐ చినమల్లయ్య జీపులో రౌండ్లు వేసినేరుగా టీ స్టాల్ వద్దకు వచ్చి ఎవడ్రా వీరిని ఇక్కడ కూర్చోబెట్టింది అని బెదిరించారని అన్నారు. అంతటితో ఆగకుండా టీడీపీ నాయకులపై దౌర్జన్యం చేస్తూ ఇక్కడి నుంచి వెళ్ళిపోండి అంటూ నోటి కొచ్చినట్లు బూతులు తిడుతూ, ఇదేమిటని ప్రశ్నించిన మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చప్పిడి రాముపై విరుచుకుపడటం అత్యంత దారుణం అన్నారు. నన్ను ప్రశ్నిస్తారా అంటూ అక్కడ ఉన్న టీడీపీ శ్రేణులలో ఒకరైన దివ్యాంగుడును లాటితో కొడుతూ వీరంగం చేసి చప్పిడి రాముని పదరా స్టేషన్‌కు అంటూ పబ్లిక్‌లో లాటితో నెట్టడంతో ప్రశ్నించిన టీడీపీ శ్రేణులపై తుపాకీ తీసి కాల్చి వేస్తామంటూ వీరంగం చేసి భయంకర వాతావరణాన్ని సృష్టించారన్నారు. టీడీపీ నాయకులను కాల్చమని సీఐ చినమల్లయ్యకి ఎవరు ఆదేశించారో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తగిన విచారణ చేసి వెంటనే సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరాధార ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దావా వేస్తా

● నరసరావుపేట ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు


క్రోసూరులో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

క్రోసూరు, మార్చి 26 : విశాఖపట్నం డ్రగ్స్ కేసులో తనపై నిరాధార ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దావా వేయనున్నట్టు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు చెప్పారు. మంగళవారం క్రోసూరులో ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పుడో కొన్ని సంవత్సరాల క్రితం ఏదో కంపెనీలో డైరెక్టర్ తనతో ఫొటో తీయించుకున్నాడని, దానిని పట్టుకొని తనపై అదే పనిగా ఆరోపణలు చేయటం శోచనీయం అన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ వారే ఇంతవరకు ఈ కేసులో నిందితుల పేర్లు వెల్లడించలేదని, కొంతమంది వ్యక్తులు పని గట్టుకొని బురదజల్లే కార్యక్రమం చేపట్టారన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, త్వరలో పరువునష్టం దావా కూడా వేయనున్నామన్నారు. బీసీలపై ప్రేమ ఉంటే ఇక్కడ ఎంపీ సీటు ఇచ్చిన వ్యక్తిని మంత్రి వర్గం నుంచి ఎందుకు తొలగించాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో పల్నాడు జిల్లాలో అభివృద్ధే ధ్యేయంగా పని చేశానని, మళ్లీ ప్రజలు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి సాధిస్తానని ఆయన తెలిపారు. ఐదు వందల కోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులతో జల జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. వరికలపూడిసెల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయనున్నట్టు తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో మూడు వందల కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పల్నాడు జిల్లాలో సాగు నీరు, తాగునీటిపై ప్రధాన దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు. సమావేశంలో పెదకూరపాడు నియోజక వర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బాష్యం ప్రవీణ్, ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

అవ్వా, తాతలకు తిప్పలే

ఏప్రిల్ 3 తర్వాతే సామాజిక పింఛన్లు ● వరుస సెలవులంటూ ప్రభుత్వ ప్రకటన ● ఉన్న నిధులు కాంట్రాక్టర్లకు చెల్లింపులు

గుంటూరు సిటీ, మార్చి 26: ఐదేళ్ళ పాలనలో అన్నివర్గాలను ఇబ్బందుల పాలు చేసిన జగన్ ప్రభుత్వంలో ఇప్పుడు అవ్వా, తాతల వంతు వచ్చింది. ఏప్రిల్ మాస పింఛన్లకు బ్రేకు పడింది. ఏప్రిల్ 3 తర్వాత వైఎస్సార్ పెన్షన్ కానుక అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వరుసగా సెలవులు వచ్చినందువల్ల ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం చెబుతోంది. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 7.80 లక్షల మంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వాస్తవానికి వీరిలో చాలామంది ఈ పెన్షన్ మీదే ఆధారపడి బతుకుతున్నారు. పిల్లల నిరాదరణకు గురైన వృద్ధులు పెన్షన్‌తోనే మందు మాకు కొనుక్కొని, పొట్టపోసుకొని బతుకుతున్నారు. గత కొద్ది నెలలుగా ప్రభుత్వం ఇలా ఏదో ఒక సాకు చెబుతూ సామాజిక పెన్షన్లు పంపిణీలో ఆలస్యం చేస్తుంది. వాస్తవానికి శుక్రవారం గుడ్‌ఫ్రైడే కావడంతో బ్యాంక్‌లకు సెలవు ఉంది. శనివారం బ్యాంక్‌లు యధావిధిగానే పనిచేస్తాయి. ప్రభుత్వం సామాజిక పెన్షన్లు పంచాలన్న ఆలోచన ఉంటే శనివారం నిధులు డ్రా చేసి, సోమవారం పంపిణీ చేయించవచ్చు. గతంలో నెల చివరి రోజు నిధులు డ్రా చేయించి పంచాయతీ కార్యదర్శికి అందజేసేవారు. పంచాయతీ కార్యదర్శి 1 వ తేదీన వాటిని వలంటీర్లకు అందజేసి ఆదే రోజు పంపిణీ చేయించే వారు. ఇప్పుడు మాత్రం ప్రభుత్వం సోమవారం బ్యాంక్‌లకు సెలవు కావటం వలన పెన్షన్లు ఆలస్యం అవుతున్నట్టు చెబుతోంది. ఒక వేళ అదే నిజం అనుకున్నా మరి మంగళవారం బ్యాంకులు మాములు గానే పనిచేసే అవకాశం ఉంది. ఆరోజు నిధులు డ్రా చేసి పంపిణీ చేసే అవకాశం కూడా ఉంది. అయినా ఏప్రిల్ 3 తర్వాతే పెన్షన్లు ఇస్తామంటూ ప్రభుత్వం చెబుతుండటం గమనార్హం.

పెద్దల కాసుల కక్కుర్తితో...

ప్రభుత్వ గడువు దగ్గర పడి, ఎన్నికలు సమీపిస్తుండటంతో ఉన్న నిధులను పార్టీ అనుకూల కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్న నేపథ్యంలో సామాజిక పెన్షన్ల పంపిణీకి ఆలస్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా ఖజానా కార్యాలయాల్లో వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లుల చెల్లింపులో పెద్దపీట వేయాలని ప్రభుత్వ పెద్ద ల నుంచి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం వస్తుందో-రాదో అన్న అనుమానంతో ఉన్న బడా కాంట్రాక్టర్లు పెద్ద మొత్తంలో పర్సెంటేజీలు చెల్లించి బిల్లల చెల్లింపుకు గ్రీన్ సిగ్నల్ తెచ్చుకుంటున్నారు. ఈ దొడ్డి దారి చెల్లింపులకే నిధులు సరిపోవటంతో సామాజిక పెన్షన్లు కూడా ఆపేందుకు జగన్ ప్రభుత్వం వెనుకాడటం లేదు. ప్రభుత్వ పెద్దల కాసుల కక్కుర్తికి గుంటూరు జిల్లాలో 2,61,598 మంది, పల్నాడు జిల్లాలో 2,83,119 మంది, బాపట్ల జిల్లా లో 2,35,791 మంది సామాజిక పెన్షన్ దారులు ఇబ్బందులు పడనున్నారు.

ఉద్యోగులకూ అదే పరిస్థితి..

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన బిల్లులు ఏప్రిల్ 1 తరువాతే అనుమతించాలని ఇప్పటికే ఉత్తర్వులు వెలువడ్డాయి. 1 వ తేదీ తర్వాత బిల్లులు పెడితే జీతాలు పడే సమయానికి నెల చివరి వారం అవుతుందని ఉద్యోగులు బహిరంగంగా నే సనుగుతున్నారు. ఉపాధ్యాయుల జీతాలు మరీ ఆలస్యం అవుతోంది అని చెబుతున్నారు. ఇప్పుడు సామాజిక పెన్షనర్లను కూడా ప్రభుత్వం వెతలకు గురిచేస్తుండటం పట్ల నిరసన వ్యక్తం అవుతోంది.

మైనింగ్ అక్రమాలను అరికడతాం : పెమ్మసాని


పెమ్మసాని, నరేంద్రకుమార్‌ను గజ మాలతో సత్కరిస్తున్న సుద్ధపల్లి వాసులు

చేబ్రోలు, మార్చి 26: చేబ్రోలు మండలంలో అక్రమ మైనింగ్‌ను పూర్తిగా అరికడతామన్ని కూటమి అభ్యర్థులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌లు ప్రజలకు హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని సుద్దపల్లి, శెలపాడు, శేకూరు, వడ్లమూడి గ్రామాల్లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో రోడ్ షో జరిగింది. ఈ సందర్భంగా గ్రామాలకు విచ్చేసిన డాక్టర్ పెమ్మసాని, నరేంద్ర కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబుకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి గ్రామంలోని తోడ్కొని వెళ్లారు. పలు గ్రామాల కూడలలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ ప్రజలు వైసీపీని నమ్మి అధికారం అప్పగిస్తే చేబ్రోలు మండలంలో 700 ఎకరాల పంట భూములను కనుమరుగు చేసి అక్రమ మైనింగ్ ద్వారా వందల కోట్లు సంపాదించారన్ని ఆరోపించారు. అక్రమ మైనింగ్‌తో పంటలు దెబ్బతిన్ని రైతులు తీవ్ర ఇబ్బందులో ఉన్నారన్నారు. తన ఉన్నతి కారణమైన ప్రజలు కష్టాల్లో ఉంటే వాల కన్నీరు తుడవటానికి గుంటూరు ఎంపీగా పోటీ చేయటానికి ముందుకు వచ్చిన్నట్లు చంద్రశేఖర్ చెప్పారు. నరేంద్ర కుమార్ మట్లాడుతూ శేకూరు గ్రామంలో అక్రమ మైనింగ్ జరగనీయబోనన్ని హామీ ఇచ్చారు. ఉందని అహంకారంతో దోపిడీదారులు ఇంకా మైనింగ్ చేయటం దారుణం అన్నారు. ఇప్పటికే అక్రమ మైనింగ్‌తో గ్రామాలు ధ్వంసం అయ్యాయన్ని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజులో వైసీపీ నాయకుల విధ్వంసాన్ని ఆపుతామన్ని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులైన పెమ్మసాని చంద్రశేఖర్‌ను, తనను గెలిపించాలన్ని నరేంద్ర కుమార్ విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కూలీల ఆటో

● 9మందికి తీవ్ర గాయాలు
● చికిత్స పొందుతూ ఒకరు మృతి


సంఘటనా స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులు, క్షతగాత్రులను ఎస్ఐ సొంత వాహనంలో తీసుకెళ్తున్న దృశ్యం

పెదనందిపాడు, మార్చి 26: స్థానిక పెదనందిపాడు - చిలకలూరిపేట ప్రధాన రహదారిలో కోల్డ్‌స్టోరేజీల సమీపంలో మంగళవారం ట్రాక్టర్, కూలీల ఆటో ఢీకొని తొమ్మిదిమందికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం కాకుమాను మండలం పెద్దివారిపాలేనికి చెందిన శ్రీనివాసరావు ట్రాక్టర్‌పై శెనగల లోడుతో కోల్డ్‌స్టోరేజీకి వెళ్తుండగా అప్పాపురం గ్రామానికి చెందిన 15 మంది మహిళా కూలీలు పొలం పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామం వెళ్తున్నారు. కోల్డ్ స్టోరేజీ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఆటో బోల్తా కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న 8మందికి కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిలో పి.శరణ్యకు ఎడమ కాలు తెగి వేరుపడింది. మరో ఇద్దరికి బలంగా గాయాలయ్యాయి. మరికొంతమందికి తలకు, ఛాతికి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. ఎంతసేపటికి రాకపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రాజ్‌కుమార్, పోలీసు సిబ్బంది తమ సొంత వాహనాల్లో కొంత మంది క్షతగాత్రులను పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కొంతమందిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మల్లెల వెంకాయమ్మ అనే మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. సంఘటపై ఎస్ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో జగన్ దుర్మార్గపు పాలన పోవాలి

నిజం గెలవాలిలో నారా భువనేశ్వరి

ఏలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దుర్మార్గపు పాలన పోయి చంద్రబాబు పాలన వచ్చేలా రానున్న ఎన్నికల్లో అందరూ సహకరించాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. అప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మరణించినవారి కుటుంబాలను పరామర్శించేందుకు ఆమె చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర మంగళవా రం ఏలూరు జిల్లాలో కొనసాగింది. కొయ్యలగూడెం మండలం కన్నాయిగూడెంలో దిర్శిపోం వెంకటలక్ష్మి, ఎర్రంపేటలో చంద్ర చిన కన్నయ్య, జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటలో బీమడోలు వెంకయ్య, జంగారెడ్డిగూడెంలో నల్లజర్ల కృష్ణ కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. ఆ కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వ అరాచకాల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అక్రమ కేసులతో చంద్రబాబు సహా అనేకమందిని జైలు పాల్జేశారని తెలిపారు. రాష్ట్రంలో ఎటు చూసినా అరాచకం రాజ్యమేలుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు మొదటి నుంచి ఒక శాశ్వత ప్రణాళికతో పనిచేసేవారన్నారు. బాబు హయాంలో పోలవరం ప్రాజక్టు నిర్మాణం 80 శాతం పూర్తయితే, గత ఐదేళ్లలో మిగతా పనులన్నీ పడకేశాయని దుయ్యబట్టారు. పట్టిసీమ ఎత్తిపోతల, రాయలసీమకు నీరందించే విషయంలోనూ ఆయన దూరదృష్టి పని చేసిందన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా గంజాయి, మాదక ద్రవ్యాలు అందుబాటులో ఉండడం అత్యంత దారుణమన్నారు. ఆఖరుకు మహిళలకు గంజాయి అలవాటు చేసే దుర్భరపరిస్థితి అడుగడుగునా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 33 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని, దీనికి కారణాలేమిటో ఆలోచిస్తేనే భయం వేస్తోందని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశాన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,35,051 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,26,748 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 80,293 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈకింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	గరిష్ఠ ధర	కనిష్ఠ ధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	8500	15500
273	9000	19000
341	9000	19500
4884	9500	17500
సూపర్ 10	8500	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21500
బ్యాడిగి	9500	18000
దేవనూరు డీలక్స్	9000	16000
నాన్ ఏసీ తెల్లకాయలు	5000	12500

టీడీపీ నేత కంచేటి సాయి అరెస్టు

సత్తెనపల్లి, మార్చి 26: పెదకూరపాడు నియోజక వర్గానికి చెందిన టీడీపీ నేత కంచేటి సాయిని అమరావతి పోలీసులు అరెస్టు చేసి మంగళవారం సత్తెనపల్లి కోర్టులో హాజరు పరిచారు. సాయి అమరావతి మండలంలోని ధరణికోటలో ఈ నెల 15న అధికార పార్టీ కార్యాలయానికి నిప్పుపెట్టిన కేసు లో నిందితుడు. సాయిని రెండు రోజుల క్రితమే ముంబైలో పోలీసులు అరె స్టు చేశారు. అక్కడి నుంచి కోర్టులో హాజరు పరిచేందుకు తీసుకువచ్చారు. సాయిని పోలీసులు తీసుకువచ్చారన్న సమాచారం తెలుసుకుని నాయకులు, కార్యకర్తలతో పాటు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ సత్తెనపల్లి పోలీసుస్టేషన్ వద్దకు వచ్చారు. దీంతో పోలీసులు స్టేషన్ వద్ద ముందు జాగ్రత్తగా బందోబస్తు ఏర్పాటు చేశారు కంచేటి సాయికి సత్తెనపల్లి రెండో జూనియర్ సివిల్ జడ్జి 15 రోజుల రిమాండ్ విధించారు. సాయిని రిమాండ్‌కు తరలిస్తున్న సమయంలో కోర్టు ఆవరణలో కరెంటు కట్ చేయటంపై టీడీపీ నాయకులు నిరసన తెలిపా రు. వైసీపీ డౌన్‌డౌన్ అంటూ నినా దాలు చేశారు. అనంతరం భారీ పోలీసు బందోబస్తు మధ్య స్థానిక సబ్ జైలుకు సాయిని తరలించారు.


సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో సాయి

పోలీసుల అదుపులో అంతరాష్ట్ర దోపిడీ దొంగ!

పొన్నూరుటౌన్, మార్చి26: రెండు తెలుగు రాష్ట్రాల్లో తాళం వేసిన గృహాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను పొన్నూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల పట్టణంలోని విద్యానగర్‌లో ఓ ఇంట్లోకి చొరబడిన చోరీ చేయటం సీసీటీవీలో గుర్తించారు. అలాగే నేతాజీనగర్‌లో తాళం వేసిన ఇంట్లో చొరబడిన దొంగలు ఆ ఇంట్లో ఏమి లభించకపోవటంతో దుస్తులు, దుప్పట్లను తగులబెట్టి అరాచకానికి పాల్పడ్డారు. వరుస చోరీలకు పాల్పడుతున్న శ్రీనివాసరావు అనే వ్యక్తిని గుర్తించిన పోలీసులు రైల్వేస్టేషన్ వద్ద పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే ఈ నిందితుడిపై ఉభయ తెలుగురాష్ట్రాల్లో పలు చోరీ కేసులు నమోదైవుండటంతో రహస్య ప్రదేశానికి తరలించి విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

కోడ్ ఉల్లంఘించిన వైసీపీ నేతపై కేసు

గంటూరు, మార్చి 26 : ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వైసీపీ నేతపై ఎన్నికల అధికారుల ఫిర్యాదు మేరకు గుంటూరు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసారు. పెదపలకలూరుకు చెందిన బాలస్వామి అనే వైసీపీ నాయకుడు కారులో వైసీపీ కండువాలు, కరపత్రాలతో వెళుతుండగా పలకలూరురోడ్డులోని కరెంట్ ఆఫీస్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీలలో ఇవి పట్టుబడ్డాయి. పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ రత్నప్రసాద్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ఆయా సామగ్రి సీజ్ చేసి రత్నప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

దంపతుల ఆత్మహత్యా యత్నం

● భర్త మృతి.. చికిత్స పొందుతున్న భార్య

కొల్లిపర, మార్చి 26: ఆర్థిక ఇబ్బందులు కారణంగా దంపతులు ఆత్మహత్యయత్నం చేసుకున్న ఘటన మండలంలోని తూములూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పద్మారావూరి చంద్రశేఖర్ (45), నాగలక్ష్మి (35)లు 25 ఏళ్లుగా దుగ్గిరాల మండలం ఈమనిలో ఉంటున్నారు. చంద్రశేఖర్ పదేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత సంవత్సరం ప్రమాదంలో చంద్రశేఖర్‌కు కాలికి తీవ్రగాయాలవ్వడంతో ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. దీంతో ఆర్థిక సమస్యలు వెంటాడటంతో సోమవారం సొంత గ్రామమైన కొల్లిపర మండలం తూములూరుకు వచ్చారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక భార్యభర్తలు ఇరువురు సోమవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు చంద్రశేఖర్‌ను, నాగలక్ష్మిని తెనాలి ప్రభు త్వ వైద్యశాలకు తరలించారు. మంగళవారం చంద్రశేఖర్ చికిత్స పొందుతూ మృతి చెందగా నాగలక్ష్మి చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు : ఎమ్మెల్సీ జంగా

దాచేపల్లి, మార్చి 26: సోషల్ మీడియా, వివిధ పత్రికలలో తనపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి గురజాల నియోజకవర్గ నాయకులను, కార్యకర్తలను, అభిమానులను కోరారు. మంగళవారం పత్రికా ప్రకట నలో తెలియ జేస్తూ గురజాల నియోజకవర్గంలోని రాజకీయ అనిశ్చితిని ఆసరాగా చేసుకొని సోషల్ మీడియాలో, పలు పత్రికల్లో రకరకాల దుష్ప్రచారాలు వారి ఆలోచనలకు తగిన విధంగా నచ్చిన విధంగా ప్రచారం చేసుకుంటున్నారని జంగా ఆరోపించారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాలు తీసుకొని వారి మనోభావాలకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటానని జంగా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జంగా అనుయాయులు కొంతమంది మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా అయోమయంలో పడేసేందుకు కొంతమంది వ్యక్తులు చేస్తున్న కుట్రలో భాగమే ఇదని స్పష్టం చేశారు. ఒకటి రెండు రోజుల్లోనే జంగా రాజకీయ నిర్ణయాన్ని స్వయంగా తెలియజేస్తారన్నారు

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రెంటచింతల, మార్చి 26: జెట్టిపాలెం మోడల్ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి మే 22 తేదీ వరకు ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఎటువంటి రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



దీక్షాపరులకు విందు వడ్డిస్తున్న వేగేశన నరేంద్రవర్మ

ఇఫ్తార్‌లో పాల్గొన్న నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, మార్చి 26 : రంజాన్ పండుగ సందర్భంగా ఉపవాస దీక్షపరులకు, ముస్లింలకు అల్లాహ ఆశీస్సులు మెండుగా ఉండాలని బాపట్ల నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండల పరిధిలోని చందోలు గ్రామంలోని తెలుగుదేశం పార్టీ మైనార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ హక్ మంగళవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వేగేశన నరేంద్రవర్మ పాల్గొని దీక్షాపరులు, ముస్లింలతో కలిసి దువా చేశారు. ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందును స్వీకరించారు. తొలుత హక్ వారి కుటుంబ సభ్యులతో కలిసి వేగేశన నరేంద్రవర్మ దీక్షపరులకు ఇఫ్తార్ విందును వడ్డించారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు మాజీ సభ్యులు ఎస్.ఎస్.నియాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎండి అఫ్జల్, బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఖాశీం, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ రజాక్, టీడీపీ సీనియర్ నాయకులు ధరియా, పిట్టలవానిపాలెం మండల మైనార్టీ నాయకులు షేక్ మీరా, చందోలు గ్రామ టీడీపీ యువ నాయకులు సయ్యద్ నిజాం, అరాఫత్, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

● వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు

బాపట్ల, మార్చి 26 : ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా రైతులకు ఇచ్చే శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలో మంగళవారం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్‌వారు ఎస్సీ సబ్ ప్లాన్ కింద రైతు విజ్ఞాన యాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేట్ డీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సబ్‌ప్లాన్ ద్వారా రైతులకు వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు, మెళకువలను ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు నేర్పించటం జరుగుతుందన్నారు. ఈ రైతు విజ్ఞాన యాత్రలో భాగంగా రైతులను వివిధ పరిశోధన స్థానాలకు తీసుకెళ్ళి శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. వారికి వరిపరిశోధన స్థానంలో మేలైన సాగు పద్ధతులు గురించి శిక్షణనిచ్చారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాలలో పాలు, పాల పదార్థాలు, చిరుధాన్యాలు వాడుకునే పద్ధతి గురించి వివరించారు. డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో వ్యవసాయంలో వాడుకోదగిన ఆధునిక వ్యవసాయ పరికరాలు గురించి తెలియజేశారు. అపరాలు, చిరుధాన్యాలు, వరిని ప్రాసెస్ చేసే విధానంలో శిక్షణనిచ్చారు. పోస్ట్‌హార్వెస్ట్ టెక్నాలజి సెంటర్‌లో కోత అనంతరం పరిజ్ఞానం గురించి, రవిగార్డెన్స్‌లో వ్యవసాయాధారిత పరిశ్రమలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విస్తరణా విభాగాధిపతి డాక్టర్ ఎంసీ ఓబయ్య, డాక్టర్ ఎం.రమాదేవి, డాక్టర్ కె.సుశీల, ఎంఎస్సి, పీహెచ్‌డీ, వ్యవసాయ జర్నలిజం విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు

పది రోజుల ముందు వరకు వచ్చే దరఖాస్తులు పరిష్కారం : ఆర్డీవో

బాపట్ల, మార్చి 26 : సార్వత్రిక ఎన్నికల నామినేషన్‌కు పది రోజుల ముందు వరకు వచ్చే ఫారం-6 దరఖాస్తులను పరిష్కరించటం జరుగుతుందని ఆర్డీవో గంధం రవీందర్ తెలిపారు. బాపట్ల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ ఫారం-7 దరఖాస్తులు 51 పెండింగ్‌లో ఉన్నాయని వాటికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎఎస్‌డీ ఓటర్ల లిస్టు తయారీపై చర్చించారు. పెండింగ్ దరఖాస్తులు గురించి తగు సూచనలు చేశారు.

మత్తు పదార్థాలకు బానిసలను చేసి ఓట్లు దండుకోవాలని కుట్ర

● బాపట్ల పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు శరత్ చంద్ర

బాపట్ల, మార్చి 26 : నూతనంగా ఓటు హక్కును పొందిన యువతను మత్తు పదార్థాలకు బానిసగా చేసి ఓట్లు దండుకోవాలనే కుట్ర వైసీపీ చేస్తోందని బాపట్ల పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మువ్వా శరత్ చంద్ర ఆరోపించారు. బాపట్ల టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కళాశాలల దగ్గర డ్రగ్స్ సరఫరా యథేచ్ఛగా జరుగుతుందన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ, ఒంగోలు రిమ్స్ కాలేజీలో మెడికల్ విద్యార్థులు పట్టపగలు గంజాయి సేవించి వీధి రౌడీలా దాడులు చేసుకున్నారన్నారు. గంజాయి వినియోగం ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌ను 12వ స్థానానికి తెచ్చారన్నారు. టీడీపీ హయాంలో ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ స్థానంలో ఉంటే నేడు గంజాయి అక్రమ రవాణాలో మొదటి స్థానంలో ఉందన్నారు. గతంలో గుజరాత్ ముంద్రాపోర్ట్‌లో ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఇరాన్ ద్వారా బెజవాడలోని ఆషిట్రేడింగ్ కంపెనీ పేరుతో రవాణా చేస్తున్న 72 వేల కోట్ల హెరాయిన్ పట్టుబడితే నేడు బ్రెజిల్ నుంచి వైజాగ్ పోర్ట్‌కు వచ్చిన 50 వేల కోట్ల డ్రగ్స్ దొరికాయన్నారు. యువత వైసీపీ రొచ్చులో పడకుండా జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో విలువైన ఓటు ద్వారా తమ భవిష్యత్తును బంగారంగా మార్చుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కుర్రా ధనేంద్ర, గోపి, రమేష్, సాధిక్, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు మువ్వా శరత్ చంద్ర తదితరులు

కూరగాయల మార్కెట్ ఆశీలు వసూళ్ళకు వేలం

బాపట్ల, మార్చి 26 : పట్టణంలోని కూరగాయల మార్కెట్ ఆశీలు వసూళ్ళు చేసుకునేందుకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ నిర్వహించిన ఈ వేలంపాటలో సర్కార్ పాట రూ.23 లక్షల 69 వేలతో ప్రారంభించగా పాలపర్తి మంగమ్మ, పఠాన్ అసీఫ్‌ఖాన్ పోటీపడ్డారు. మంగమ్మ రూ.26 లక్షల 80 వేల వరకు పాటకు రాగా అసీఫ్‌ఖాన్ రూ.26 లక్షల 81 వేలతో హెచ్చుపాటదారునిగా నిలిచారు. దీంతో వేలంపాటలో మార్కెట్‌లో ఆశీలు వసూళ్ళు చేసుకునే అవకాశం పొందారు. గత ఏడాది కూరగాయల మార్కెట్‌కు రూ.26 లక్షల 65 వేలు రాగా ఈ ఏడాది కేవలం రూ.16 వేలు మాత్రమే అదనపు ఆదాయం లభించింది. కార్యక్రమంలో ఆర్‌వో సుబ్బారావు, ఆర్ఐ ఇమామ్, పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.

దమ్మనవారిపాలెంలో కోన వెంకట్ ఎన్నికల ప్రచారం

కర్లపాలెం, మార్చి 26 : మండలంలోని దమ్మనవారిపాలెంలో బాపట్ల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి తరుపున ప్రముఖ సినీరచయిత కోన వెంకట్ మంగళవారం దమ్మనవారిపాలెంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కోన రఘుపతిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, మండల కన్వీనర్ ఏడుకొండలు, మార్కెట్ యార్డు ఛైర్మన్ సీతారామిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు పందరబోయన సుబ్బారావు, చీరాల సత్యనారాయణరెడ్డి, ఎంపీసీ అసీఫ్ ఆలి, నాగేశ్వరరెడ్డి, బెనర్జి, శివారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పెద్ద అబ్బాయి ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

కర్లపాలెం, మార్చి 26 : మండలంలోని నల్లమోతువారిపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న కస్తూరిబాయ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మాడా బుజ్జిబాబు నోట్‌బుక్స్, పెన్నులను ఏర్పాటు చేయగా మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు ఆసోది పద్మశ్రీ, బుజ్జిబాబు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పాలపర్తి నాగేంద్రమ్మ, విద్యాకమిటీ ఛైర్మన్ వనసాల స్వప్న, వైస్ ఛైర్మన్ మందపాటి దివ్య తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళిక రూపొందించాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, మార్చి 26 : వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో జలవనరులు, ప్రజల అవసరాలు, వాటి వినియోగంపై అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో తాగునీటి అవసరాల కొరకు ఏప్రిల్ 8వ తేదీన సాగర్ నీరు విడుదల కానుందని తెలిపారు. విడుదలయ్యే నీటితో సమ్మర్‌స్టోరేజిట్యాంక్‌లన్నింటిని నింపాలన్నారు. నీటి కొరత ఉన్నందున నీటి చౌర్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, సాగర్ కాల్వలకు నీరు విడుదలయ్యే లోగా అత్యవసరమైన మరమ్మతులు, లీక్‌ల నివారణ చేపట్టాలన్నారు. రక్షిత మంచినీటి పథకాల పనులు శరవేగంగా ముగించాలన్నారు. నాగార్జునసాగర్ కాల్వల కింద ఉన్న 131 సమ్మర్ స్టోరేజిట్యాంక్‌లు నింపటానికి 0.443 టీఎంసీల నీరు విడుదల కానుందన్నారు. కృష్ణా, పశ్చిమ డెల్టా కింద ఉన్న 52 సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌లు నింపటానికి 0.16 టీఎంసీల నీరు విడుదలవుతుందన్నారు. అలాగే గుండ్లకమ్మ నదిపరివాహక ప్రాంతాలలోని చెరువులను నింపటానికి 0.05 టీఎంసీల నీరు వస్తుందన్నారు. జలవనరులు అందుబాటులో లేని గ్రామాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. 153 చేతిపంపులు చెడిపోయాయని వాటిని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆదేశించారు. సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌లు లేని గ్రామాలలో బోర్లు వేయటానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీనిధులు వినియోగించాలన్నారు. చెడిపోయిన బోర్లు సైతం మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రస్తుతం కొల్లూరు మండలంలోనే 10 మీటర్ల మేర భూగర్భజలాలు అడుగంటాయని కలెక్టర్ చెప్పారు. బోర్లు వేయటానికి అవకాశాలు లేని ప్రాంతాలలో ట్యాంకర్లతో నీరు తరలించటంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేవాహనాలకు జీపీఎస్‌యాప్ అనుసంధానం చేస్తామని చెప్పారు. జిల్లా స్థాయి కమిటీలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈలు ఉంటారన్నారు. 750 బ్లాక్‌లుగా గుర్తించి పూర్తి స్థాయి పర్యవేక్షణ కొరకు మండల, పంచాయతీ స్థాయిలో కమిటీలు వేస్తున్నట్లు వివరించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

● మండలాల వారీగా నీటి లబ్ధిత, రానున్న అవసరాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. ప్రస్తుతం వేమూరు నియోజకవర్గంలో 159 గ్రామాలు ఉండగా 12 గ్రామాలు రక్షితనీటి పథకంపై ఆధారపడ్డాయని, మిగిలిన వాటికి బోర్లు, ఫిల్టర్‌బెడ్‌ల ద్వారా నీరు అందుతుందన్నారు. బాపట్ల నియోజకవర్గంలో 133 గ్రామాలు ఉంటే 93 గ్రామాలు బోర్లపైన ఆధారపడ్డాయని వివరించారు. అద్దంకి నియోజకవర్గంలో 101 గ్రామపంచాయతీలోని ప్రజలకు సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌లు, బోర్ల ద్వారా నీరు అందుతుందన్నారు. పర్చూరులో 143 గ్రామపంచాయతీలలో 83 ట్యాంక్‌లు ఉండగా మిగిలిన వాటికి సాగర్, పంటకాల్వల ద్వారా నీరు వస్తుందన్నారు. చీరాలలో 63 గ్రామాలు ఉండగా ఒక్క గ్రామానికి నీటి సమస్య ఉందన్నారు. మిగిలిన వాటికి చెరువులు, కాల్వల ద్వారా నీరు అందుతుందన్నారు. చీరాల పట్టణానికి మూడునెలలు వరకు నీటి సమస్యలేదన్నారు. రేపల్లెలో గ్రామాలన్నీ కాల్వలపైనే ఆధారపడినట్లు వివరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ విద్యాసాగర్, జిల్లాపంచాయతీ అధికారి రవికుమార్, అనుబంధశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కిష్కింధపాలెం ఘటనకు బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ నేత మురళీకృష్ణ

వేమూరు, మార్చి 26 : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు వైసీపీ జెండా కలిగి ఉన్నాడని ఫిర్యాదు చేసిన టీడీపీ కార్యకర్త సమాచారాన్ని వైసీపీ నాయకులకు అందజేసిన డిజిటల్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో పలు రాజకీయ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో కొల్లూరు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు మైనేని మురళీకృష్ణ కిష్కింధపాలెంలో జరిగిన సంఘటన గురించి ప్రస్తావించారు. అధికారులు ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు చేయలేదని, కేవలం తమ పార్టీ జెండాలు, బ్యానర్లు మాత్రమే తొలగించడంతో తమ కార్యకర్త ఒకరు వైసీపీ ఎంపీటీసీ ఇంటి మీద ఉన్న ఆ పార్టీ జెండాను ఎందుకు తొలగించలేదని అధికారులను ప్రశ్నించారు. ఈ విషయాన్ని గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వ్యక్తి పలాన వ్యక్తి నీపై ఫిర్యాదు చేశాడంటూ చెప్పడంతో పాటు ఫిర్యాదు ఫోన్ నెంబర్ ఇచ్చాడని దీంతో ఆ ఎంపీటీసీ ఫోన్‌లో మాట్లాడుతూనే ఫిర్యాది ఇంటికి వచ్చి విచక్షణా రహితంగా దాడి చేసి ఇంట్లో నుంచి బయటకు ఈడ్చుకు వచ్చాడన్నారు. పైగా తానే దాడి చేసి తమ కార్యకర్తపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాడన్నారు. ఎన్నికల కోడ్‌ను అమలు చేయకపోగా డిజిటల్ అసిస్టెంట్ వివాదాస్పదంగా వ్యవహరించాడని ఆరోపిస్తూ అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు తహసీల్దార్ స్పందిస్తూ ఈ విషయంపై పూర్తి సమాచారం కోసం కొల్లూరు ఎంపీడీవోను ఆర్‌ఓ ఆదేశించడం జరిగిందన్నారు. సమావేశంలో ఎన్నికల అజెండాపై మాట్లాడుతూ 16వ తేదీలోగా తమకు అందిన ఓటర్ల దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి పరిష్కరించడం జరిగిందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు దండే వెంకట సుబ్బారావు, ఎం.శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు బొల్లిముంత ఏడుకొండలు, జ్యోతిబాబు, తహసీల్దార్లు కిరణ్, కవిత, మునిలక్ష్మీ, పుల్లారావు, ఎన్నికల డిటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కిష్కిందపాలెం ఘటనపై మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు మైనేని మురళీకృష్ణ

కిష్కింధపాలెం ఘటనపై ఆర్ఓ వివరణ

కొల్లూరు మండలం కిష్కిందపాలెంలో పార్టీ జెండా తొలగించాలంటూ నాపై ఫిర్యాదు చేస్తావా అంటూ వైసీపీ ఎంపీటీసీ టీడీపీ కార్యకర్త ఇంటిపై దాడి చేసి కొట్టి గాయపరచిన సంఘటనపై ఆర్‌ఓ వసంతరాయుడుని వివరణ కోరగా ఈ విషయంపై కొల్లూరు ఎంపీడీవోకి డిజిటల్ అసిస్టెంట్‌కు నోటీసులు జారీ చేయాలని, పోలీసు శాఖను కూడా పూర్తి సమాచారం సేకరించాలని ఆదేశించామన్నారు. ఆయా శాఖల అధికారుల నుంచి నివేదికలు రాగానే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

సబ్ ప్లాన్ ప్రకటించని పార్టీలను బహిష్కరించండి

● డాక్టర్ నాగిశెట్టి

బాపట్ల, మార్చి 26 : ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ గురించి ప్రకటించని పార్టీలను బహిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షులు డాక్టర్ నాగిశెట్టి ధర్మయ్య మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. భారతరాజ్యాంగం ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు విధిగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ప్రకారం చట్టసభలలో నిధులు కేటాయింపు ప్రకటించటమేకాకుండా ఆ నిధులను దారిమళ్ళించకుండా తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. సదరు నిధులు సక్రమంగా వినియోగించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా సబ్ ప్లాన్ యాక్ట్‌ను చట్టం చేశారన్నారు. సబ్‌ప్లాన్ నిధులు ఇతర పథకాలకు మళ్ళించకుండా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికే ఉపయోగిస్తామని రాజకీయపార్టీలు తమ మేనిఫెస్టోలో విధిగా ప్రకటించాలని, అలా ప్రకటించని పార్టీలను ప్రజలు బహిష్కరించాలని ఆయన కోరారు.

బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

● కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

బాపట్ల, మార్చి 26 : బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. బాపట్ల కాపు కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం బాపట్ల పార్లమెంట్ ముఖ్యనాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేడీ శీలం మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ పరిధిలోని ప్రతి గ్రామంలో ఏజెంట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. దీని కోసం పార్టీశ్రేణులు కృషి చేయాలన్నారు. ఐక్యంగా పార్టీ బలోపేతానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతిప్రకాష్, తాడికొండ వెంకటేశ్వరరావు, పఠాన్ రాజేష్, దోనేపూడి దేవరాజు, సంపత్, సురేంద్ర, బి.సుబ్బారావు, కేశన రామకోటేశ్వరరావు, పి.సుధాకర్, దండు రేణుక, అనుప్రవల్లిక, ఎస్‌వీఆర్.కుమార్, బక్కా రోశయ్య, శంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శీలం సాగర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం

ఆటో బోల్తాపడి వ్యక్తి మృతి

బాపట్ల, మార్చి 26 : ఆటో బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందగా మరో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. రూరల్ సీఐ వై.శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం పొన్నూరు మండలం మాచవరం గ్రామానికి చెందిన తాడిశెట్టి హరిబాబు కుటుంబ సభ్యులతో కలిసి బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శిచేందుకు మంగళవారం వచ్చారు. తిరిగి ఇంటికెళ్ళేందుకు బాపట్లలో ఆటో ఎక్కి వెళుతుండగా అప్పికట్లరోడ్డులో సమ్మర్‌స్టోరేజి ట్యాంక్ సమీపంలో ఆటోబోల్తాపడి డ్రైవర్ పక్కనే కూర్చొన్న తాడిశెట్టి హరిబాబు (65) అక్కడికక్కడే మృతి చెందాడు. తాడిశెట్టి వెంకటకుమారికి గాయాలు కావటంతో ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్‌తోపాటు మిగిలిన వారికి ఎటువంటి ప్రమాదంలేదు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

200 మందికి వైద్యసేవలు

కర్లపాలెం, మార్చి 26 : కర్లపాలెం మండలంలోని యాజలి గ్రామంలో ఉన్న హెల్త్ వెల్‌నెస్‌సెంటర్‌లో మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించి 200 మందికి వైద్యసేవలందించామని డాక్టర్ గోపినాధ్ తెలిపారు.

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రం సుభిక్షం : అఖిలేశ్

చుండూరు మార్చి 26 : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా అభివృద్ధి పథంలో నిలవడానికి చంద్రబాబు పాలనతోనే సాధ్యమని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖిలేశ్ అన్నారు. వలివేరులో రెండో రోజు మంగళవారం సూపర్ 6 పథకాలపై ఓటర్లలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అఖిలేశ్ మాట్లాడుతూ చంద్రబాబు పాలన, అనుభవం, దక్షిత రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో సుభిక్షంగా నిలుపుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న హింస, దోపిడీ, అవినీతి వ్యవస్థలకు చెక్ పెట్టడానికి ఓటు అనే ఆయు ధాన్ని వినియోగించుకోవాలని అఖిలేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీ అమలు చేసే పథకాల గురించి వివరిస్తున్న అఖిలేశ్

సార్వత్రిక ఎన్నికలపై అధికారులకు అవగాహన

రేపల్లె, మార్చి 26 : రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సచివాలయ సిబ్బంది ఏవిధంగా విధులు నిర్వహించాలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలా షారోన్ తెలిపారు. నగరం మండలం ఏలేటిపాలెం సచివాలయం, రేపల్లె మండలం, పట్టణంలో పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలను భద్రపరుచు గోడౌన్‌లను తనిఖీ చేశామన్నారు. విధి నిర్వహణలో ఉద్యోగుల పాత్ర, ఎన్నికల నియమావళిని వారికి వివరించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎంపీడీవో

కొల్లూరు, మార్చి 26 : అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో బిఎం లక్ష్మీకుమారి మంగళవారం అన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలు చేయడంలో నిర్లక్ష్యంగా ఉన్న గాజుల్లంక సచివాలయ కార్యదర్శి గౌతమ్‌కు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ఇటీవల కిష్కిందపాలెంలో ఎన్నికల కోడ్ అమలుపై ఫిర్యాదు చేసిన వ్యక్తి గురించి ఎంపీటీసీకి సమాచారం ఇచ్చిన డిజిటల్ అసిస్టెంట్‌కు కూడా నోటీసు జారీ చేయడం జరిగిందన్నారు. వారి నుంచి లిఖిత పూర్వక సంజాయిషీ వచ్చిన అనంతరం నివేదికను నియోజకవర్గ ఎన్నికల అధికారికి అందిస్తామన్నారు. డిజిటల్ అసిస్టెంట్‌ను ప్రస్తుతం పని చేస్తున్న సచివాలయం నుంచి మరో సచివాలయానికి బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయని ఆమె తెలిపారు.

వైభవంగా తిరునాళ్ళ మహోత్సవం

బాపట్ల, మార్చి 26 : పట్టణంలోని మున్నంవారిపాలెంలో ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ళ మహోత్సవాన్ని మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం పాలపొంగళ్ళు పొంగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మేళతాళాలతో అమ్మవారికి పసుపుకుంకుమ సమర్పించారు. అనంతరం ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, హరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. బాపట్ల పరిసర ప్రాంతాలు నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకొని పూజలు చేసి ఉత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని మున్నంవారిపాలెం భక్తబృందం, ఆలయ కమిటీ పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించరాదు : ఆర్డీవో



ఆర్డీవో హేలా షారోన్

రేపల్లె, మార్చి 26 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వివిధ వర్గాల రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల నిబంధనలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోసం తాత్కాలిక పార్టీ కార్యాలయాలను పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయకూడదని సూచించారు. ప్రైవేటు స్థలాలు, పాఠశాల సమీపంలో, ఆధ్యాత్మిక ప్రాంతాలలో ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి 24/7 కార్యాలయాలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే సి విజన్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేసుకోవచ్చని సూచించారు. సి విజన్ ద్వారా వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించటం జరుగుతుందని తెలిపారు. ఇతర సమాచారం కొరకు ఆర్‌వో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. సమస్యలు ఉంటే 08648-293795కు నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ఏశాఖ పైనైనా ఫిర్యాదు వస్తే సకాలంలో స్పందించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టం చేశామన్నారు. రాజకీయ పార్టీ అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు. ఇంటింట ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలు, సభలు పెట్టుకునేందుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్ద అనుమతి తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రచారానికి సంబంధించిన పాంప్లేట్లు, పోస్టర్లు, హోర్డింగ్ ఏర్పాట్లలో కూడా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు.

కాంట్రాక్టర్ల అవతారమెత్తిన వైసీపీ నాయకులు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా

భట్టిప్రోలు, మార్చి 25 : జగనన్న కాలనీల్లో ఇల్లు నిర్మిస్తామంటూ వైసీపీ నాయకులు కాంట్రాక్టర్ల అవతారమెత్తి లబ్ధిదారులను మోసం చేశారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆరోపించారు. పోరుబాట -10 కార్యక్రమంలో భాగంగా మంగళవారం భట్టిప్రోలు జగనన్న కాలనీని సందర్శించి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, జరుగుతున్న మోసాలను సమాజానికి తెలియజేసేందుకు పోరుబాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భట్టిప్రోలు జగనన్న కాలనీలో స్థల సేకరణ దగ్గర నుంచి ఇల్లు నిర్మించే వరకు అధికార వైసీపీ నాయకులు ప్రజాధనాన్ని దోచుకుతిన్నారన్నారు. కాలనీల్లో మౌళిక వసతులు కల్పించకుండా ఇల్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులపై ఒత్తిడి తీసుకురావడం ఏంటని ఆయన ప్రశ్నించారు. స్థానిక వైసీపీ నాయకులు సలీం, బాలాజీ కాలనీలో ఇల్లు కట్టిస్తామని చెప్పి నాసిరకం మెటీరియల్‌ను వినియోగించి లబ్ధిదారులను నిలువునా దోచుకున్నారన్నారు. ఇళ్ళ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఒక్కో లబ్ధిదారుని నుంచి రూ.14 వేల నుంచి రూ.15 వేల వరకు మోసం చేశారని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని లబ్ధిదారులను మోసం చేసిన వారిపై విచారణ జరిపించి మోసం పోయిన వారికి న్యాయం చేస్తామని హామీనిచ్చారు. కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌళిక వసతులు కల్పించి ఇంటి నిర్మాణాలు జరిగేలా చూస్తామని, కాలనీలో లబ్ధిదారులు నివాసం ఉండేలా తక్షణ చర్యలు చేయిస్తామని సాయిబాబా చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బట్టు మల్లికార్జునరావు, కర్ల శ్రీనివాసరావు, జంగం శ్యాంసన్, ఇబ్రహీంబేగ్, శ్రీనివాసరావు, జనసేన నాయకులు వై. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలు జగనన్న కాలనీలో లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందిపై మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా

అర్చకుడిపై దాడి చేసిన వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి

రేపల్లె, మార్చి 26 : సమాజంలో తలదించుకునేలా వైసీపీ నాయకుల ఆగడాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయని, శివాలయం అర్చకుడిపై వైసీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్‌పై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బ్రాహ్మణ సమాఖ్య నాయకుడు సీవీ మోహన్‌రావు అన్నారు. కాకినాడలో పురాతన శివాలయంలో అర్చకుడు వెంకట సత్యసాయిపై వైసీపీ నాయకుడు చంద్రరావు చేసిన దాడికి నిరసనగా తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ భక్తిభావంతో ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులపై దాడులు చేయటం ఎంత వరకు సమంజసమన్నారు. అర్చకులపైన ఇలాంటి చర్యలు జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవటం సిగ్గుచేటన్నారు. తక్షణమే చంద్రరావుపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించి, ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సమాఖ్య నాయకులు ఆగస్టిన్, చావల సురేష్‌శర్మ, శ్రీనివాస దీక్షితులు, యోగానంద్, మారుతిశర్మ, బాలసుబ్రహ్మణ్యశర్మ, కె.నాగశ్రీ, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



రేపల్లె తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న బ్రాహ్మణ సమైఖ్య నాయకులు

చంద్రబాబు సభను విజయవంతం చేయాలి : మల్లాది

చెరుకుపల్లి, మార్చి 26 : రేపల్లెలో ఈనెల 31వ తేదీన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొంటారని, ప్రజలు విరివిగా పాల్గొనాలని టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ కోరారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సంక్షేమాల సారథి చంద్రబాబు అని అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొనాలన్నారు. సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మొహమాటం రాధాకృష్ణమూర్తి, ఉప్పాల సాంబశివరావు, దివి రాంబాబు, మద్దుల వెంకటేశ్వరరావు, గోగినేని వసుధ, ఆలపాటి లక్ష్మీ, కందుల చంద్రమౌళి, నాగుల పున్నారావు, వివిధ గ్రామాల టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాం

రేపల్లె, మార్చి 26 : జై భీమ్ రామ్ భారత్ పార్టీ దశా దీవెనలతో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని జై భీమ్ రామ్ భారత్ పార్టీ రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి దోవ రమేష్‌రాంజీ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ న్యాయమూర్తి జాడ శ్రావణ్ కుమార్ పార్టీ ఎన్నికల మ్యానిఫేస్టోలో మహనీయుల పేరిట పొందుపరిచన దశా దీవెనలతో సామాన్య ప్రజల జీవన ప్రమాణం మెరుగుపరిచే విధంగా మ్యానిఫేస్టోను తయారు చేశారన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోతార్లంక శివ వెంకటేశ్వరరావు, కర్రా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అంతం.. అదే మన పంతం



కొండయ్యకు సంఘీభావం తెలుపుతున్న మద్దతుదారులు

చీరాల, ఏప్రిల్ 22: వైసీపీ అంతం.. అదే మన పంతమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని చెప్పారు. కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమన్నారు. అందుకనుగుణంగా ప్రతిఒక్కరూ కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముందస్తు అనుమతులతో ర్యాలీలు నిర్వహించుకోవాలి

అద్దంకి, మార్చి 26: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నేతలు ముందస్తు అనుమతులు తీసుకొనిసమావేశాలు, ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకోవాలని అద్దంకి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రాజకీయ పార్టీల ప్రతినిధులు నిబంధనలు పాటించాలన్నారు. 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో పలురాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

పర్చూరు, మార్చి 26: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సభలు, సమావేశాల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో) గంధం రవీందర్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఏటీ టీంల అధికారులు, పోలీసు అధికారులతో ఆర్వో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్వో మాట్లాడుతూ కోడ్ ఉల్లంఘనలకు తావులేకుండా టీమ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ నుండి కోడ్ అమల్లో ఉందన్న విషయాన్ని ఆయా రాజకీయ పార్టీలకు వివరించాలని సూచించారు. అనుమతులు లేకుండా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో పర్చూరు ఏఈఆర్వో సీహెచ్ సుబ్బయ్య, ఇంకొల్లు ఏఈఆర్వో ఎం.ప్రమీల, వివిధ టీం అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

చీరాలటౌన్, మార్చి 26: 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని నోడల్ అధికారి వైపీ రెడ్డి పేర్కొన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గుణశీల, సుబ్బారావు, హరిహరరావు, యలమందారెడ్డి, నాగవీరభద్రాచారి, వెంకనకన్నబాబు, గోపిరెడ్డి, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి

అద్దంకి, మార్చి 26: అర్చకులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సాధికార కమిటీ, బాపట్ల జిల్లా కన్వీనర్, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఆర్గనైజర్ పొన్నలూరి కిరణ్‌కుమార్ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాకినాడ శివాలయంలో అర్చకులు సాయిశర్మ, విజయ్‌శర్మపై ఆలయంలో దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు. అర్చకులను కాళ్లతో తన్ని, భౌతిక దాడికి దిగిన మాజీ కార్పొరేటర్ చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. దాడికి పాల్పడ్డ నిందితుడికి మద్దతు ఇస్తున్న ఆలయ ఈవో, కాకినాడ జిల్లా దేవదాయ శాఖ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికలలో బ్రాహ్మణులు వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు.

హుండీల కానుకల లెక్కింపు



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హుండీల కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అద్దంకి, మార్చి 26: శింగరకొండ 69వ వార్షిక తిరునాళ్ల సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పది రోజులకు హుండీల కానుకల ద్వారా రూ.8,26,081 ఆదాయం వచ్చినట్లు ఈవో సుభద్ర తెలిపారు. హుండీల కానుకలను మంగళవారం లెక్కించారు. యూఎస్ఏ డాలర్లు 52, బంగారం 16 గ్రాములు, వెండి 465 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. హుండీల కానుకల లెక్కింపును ఫెస్టివల్ ఆఫీసర్ తిమ్మనాయుడు, ఈవో సుభద్ర పర్యవేక్షించారు.

అలాగే, లక్ష్మీనరసింహస్వామి దేవాలయం హుండీల కానుకలను మంగళవారం చైర్మన్ నర్రావుల కొండలరావు, ఈవో కోటిరెడ్డి పర్యవేక్షణలో లెక్కించారు. హుండీల కానుకల ద్వారా గత ఏడాది రూ.1,05,270 రాగా, ఈ ఏడాది రూ.89,350 వచ్చింది. టిక్కెట్ల ద్వారా గత ఏడాది రూ.1,44,700 రాగా, ఈ ఏడాది 1,15,570 వచ్చింది. గత ఏడాది కంటే రూ.44,720 ఆదాయం తగ్గింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చినగంజాం, మార్చి 26: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002- 2003 విద్యా సంవత్సరం పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు మండలంలోని బాపయ్యనగర్ సముద్రతీరం వద్ద మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆత్మీయంగా పలకరించుకుంటూ నాటి సంఘటనలు తలుచుకుంటూ సందడి చేశారు. పూర్వ విద్యార్థి ఆసోది సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అమెరి కాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పల్లపోలు సురేంద్ర, రామిశెట్టి గోపినాథ్, పి.హరి కృష్ణ, ధర్మవరపు వెంకట్, నరహరి వెంకటేష్, కోడూరి సోంబాబు, బెంగుళూరు, చెన్నై వివిధ దూర ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు వచ్చి నాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామిరెడ్డి, విద్యాసాగర్, దేశంశెట్టి సురేష్, పల్లపోలు శివన్నారాయణ, వెంక టేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

చందలూరు విద్యార్థినికి బంగారు పతకం

పంగులూరు, మార్చి 26: మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన కర్రి అలేఖ్యకు బంగారు పతకం లభించింది. బ్యాచ్‌లర్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో సెంట్రల్ యూనివర్శిటీలో ప్రథమురాలిగా నిలిచిన అలేఖ్యకు యూనివర్శిటీ గోల్డ్ మెడల్ ప్రకటించింది. 2022 సంవత్సరంలో బ్యాచ్‌లర్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ ఇంజనీర్ పట్టా అందుక్ను అలేఖ్యకు యూనివర్శిటీ స్థాయిలో ఇటీవల జరిగిన 7వ కాన్వొకేషన్‌లో ఈ అవార్డు ప్రకటించారు. ఇంటర్ వరకు ఒంగోలులోని నవోదయ పాఠశాలలో విద్యనభ్యసించిన అలేఖ్య ఇంజనీరింగ్ విద్య కర్నాటక కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పూర్తి చేసింది. గోల్డ్ మెడల్ సాధించిన అలేఖ్యకు పలువురు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

చలివేంద్రాలు ఏర్పాటు

ఇంకొల్లు, మార్చి 26: మండలంలోని పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసారు. సుబ్బారెడ్డిపాలెంలో రెండు చలివేంద్రాలను మంగళవారం ప్రారంభించినట్లు సర్పంచ్ బి.సురేష్‌కుమార్ తెలిపారు. 90 రోజుల పాటు గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గొల్లపాలెం బస్టాప్ వద్ద ఆగ్రామ యువత ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేశారు.

ఉచిత ప్రవేశాల దరఖాస్తుల గడువు పొడిగింపు

అద్దంకిటౌన్, మార్చి 26: ప్రైవేట్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ఉచితం ప్రవేశం కోసం దరఖాస్తు గడువును పాఠశాల విద్యా సమగ్ర శిక్ష ఈనెల 31 వరకు పెంచిందని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం గతంలో ఈనెల 25 వరకు గడువు ఇచ్చిందని తెలిపారు. అధిక సంఖ్యలో విద్యార్థులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31వ వరకు పెంచినట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని ఆయన కోరారు.

కలిసి పనిచేద్దాం.. అభివృద్ధి సాధిద్దాం

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- టీడీపీలో పలువురు చేరిక



ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన కడవకుదురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు



టీడీపీలో చేరిన ఆదిపూడి వైసీపీ కార్యకర్తలు

పర్చూరు, మార్చి 26: పర్చూరు నియోజకవర్గంలో వలసల పర్వం జోరందుకుంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్న వారికి పార్టీ కండువాలుకప్పి సాదరంగా ఆహ్వానిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారు. దీంతో పార్టీలో సందడి వాతావరణం నెలకొంది. వైసీపీకి ఓటు బ్యాంకుగా ఉన్న గ్రామాల నుంచి సైతం పెద్ద ఎత్తున ఏలూరి సమక్షంలో చేరుతున్నారు. కడవకుదురు, ఆదిపూడి, పర్చూరు నుంచి పెద్ద ఎత్తున మంగళవారం పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిన అభివృద్ధి పనులన్నింటిని పునఃప్రారంభిస్తామన్నారు. గత తెలుగుదేశం హయాంలో పర్చూరు నియోజవర్గ అభివృద్ధిని పరుగులు పెట్టించినట్టు గుర్తుచేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలంతోపాటు, ఇళ్లు నిర్మించి ఇచ్చేవిధంగా కృషిచేస్తామని చెప్పారు.

ఆదిపూడి గ్రామం నుంచి వైసీపీకి చెందిన పారి స్టీఫెన్, పారి జీవన్, జోసెఫ్, తేళ్ల మధు, బత్తుల బ్లేస్సీ, జాన్‌పాల్, మహేష్, బత్తుల క్రాంతి కుమార్, మాణిక్యరావు, శ్రీకాంత్, ప్రభుదాసు, కత్తి మధు, గద్దె కార్తీక్‌లకు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే, కడవకుదరు గ్రామానికి చెందిన వైసీపీ బీసీ సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చేరారు. పార్టీలోకి చేరిన వారిలో పైనం గోపి, పైనం సురేష్, కేసన సురేష్, బొర్ర అశోక్, సురగాని రామకృష్ణ, పైనం కాశీరాం, బొర్ర ఫణి, బొర్ర శోభనరావు, ఈఊరి నారాయణ, కేసన సాంబయ్య, తదితరులు ఉన్నారు.

కార్యక్రమంలో స్థానిక నాయకులు ముత్యాల రాజేష్, అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, దీర్ఘాల రమేష్ తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి విస్తృత పర్యటన

పర్చూరు, మార్చి 26: పర్చూరు నియోజకవర్గంలో మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విస్తృతంగా పర్యటించారు. మార్టూరు, నూతలపాడు, భీమవరం, ఇంకొల్లు, దగ్గుబాడు, విం జనంపాడు గ్రామాల్లో పర్యటించిన ఆయన ప్రజా సమస్యలను తెలుసుకుంటూ.. ప్రజలను పలుకరిస్తూ, పలు కుటుంబాలను ఓదారుస్తూ ముందుకు సాగారు. ఉదయం ఏలూరి క్యాంపు కార్యాలయంలో పలుగ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయా గ్రామాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన నాయకులతో మాట్లాడారు. దగ్గుబాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఎం.మక్బూల్ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

నూతలపాడుకు చెందిన కానిశెట్టి సుబ్బారావు పార్థీవ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇంకొల్లుకు చెందిన నాయుడు రాజేంద్రప్రసాద్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- అర్చకునిపై వైసీపీ నేత దాడి అందుకు నిదర్శనం
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



అద్దంకి, మార్చి 26: కాకినాడ శివాలయంలో అర్చకునిపై వైసీపీ నేత దాడి ఘటన జగన్‌రెడ్డి అరాచక పాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈమేరకు మంగళవారం ఓప్రకటన విడుదల చేశారు. యథా నాయకుడు, తథా క్యాడర్ అన్న చందంగా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని అన్నారు. వేదాలు చదివి భగవంతుని సేవలో తరించే అర్చకులపై దాడి చేయటం, బెదిరింపులకు గురిచేయటం రాక్షసత్వమే అవుతుందన్నారు. పూజారులపై దాడి చేయటం అంటే దేవుడిపై దాడి చేయటమేనని అన్నారు. భగవంతుని సన్నిధిలో అందరూ ఒక్కటే అనే ఇంగిత జ్ఞానం కూడా వైసీపీ నేతలకు లేకపోవటం బాధాకరమని చెప్పారు. హిందూ దేవాలయాలు, ఆస్తులపై పూర్తి ఆధిపత్యం చెలాయించే క్రమంలోనే వైసీపీ ప్రభుత్వం దారుణాలకు ఒడిగడుతుందన్నారు. తాను తెచ్చిన పాలు శివలింగంపై సరిగా పోయలేదని అర్చకుడిపై వైసీపీ నేత చంద్రరావు దాడి చేయటం, చెంపపై కొట్టి కాలితో తన్నటంతో పాటు, అడ్డుకోబోయిన మరో అర్చకుడుపైనా దాడి చేసి బూతులు తిట్టాడన్నారు.

ఈ ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో హిందూ దేవాలయాల అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే రవికుమార్ చెప్పారు. అర్చకులకు వేతనాల పెంపు లేకపోగా, వారిపైనే దాడులకు దిగుతున్నారన్నారు. కరోనా సమయంలో చనిపోయిన అర్చకుల కుటుంబాలను కూడా జగన్‌రెడ్డి ఆదుకోలేదన్నారు. ఆయన పాలనలో అర్చకులపై వరుస దాడులు జరిగాయన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని సోమేశ్వర స్వామి ఆలయ అర్చకుడి యజ్ఞోపవీతాన్ని వైసీపీ నేత యుగంధర్ తెంపేశాడన్నారు. కర్నూలు జిల్లా ఓంకార క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా అర్చకులపై ఆలయ చైర్మన్ ప్రతాపరెడ్డి దాడి చేశారన్నారు. ఎమ్మిగనూరు మండలం పార్లపల్లిలో ఆంజనేయ స్వామి గుడి అర్చకుడు సాగు చేసుకుంటున్న భూమిపై కన్నేసిన వైసీపీ నేతలు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించటంతో పూజారి భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమడోలులో అర్చకుడు రామలింగాచారి ఇంటిని వైసీపీ నేతలు కూల్చేయటంతో తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. నర్సరావుపేట సమీపంలోని త్రికోటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఓ వైసీపీ నేత తనకు అర్చకుడు సరిగ్గా మర్యాద లు చేయలేదంటూ దాడి చేశాడన్నారు. గుంటూరు జిల్లా గోరంట్లలో వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకుడు ఆరోగ్యం బాగా లేక సెలవు అడిగితే ఏకంగా అధికారులే అతనిపై దాడి చేశారన్నారు. ఇలా ఐదేళ్ల కాలంలో లెక్కలేనన్ని సంఘటనలు జరిగాయని ఎమ్మెల్యే గొట్టిపాటి పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం, ప్రజల క్షేమం కోరే బ్రాహ్మణులు, అర్చకులపై వైసీపీ పాలనలో దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరో 47 రోజులలో రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని అన్నారు.

నేడు పలు గ్రామాల నేతలతో ఎమ్మెల్యే సమావేశం

అద్దంకి, మార్చి 26: పలు గ్రామాల నేతలతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ముప్పవరం వద్ద క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అద్దంకి మండలంలోని చక్రాయపాలెం నేతలతో ఉదయం 10 గంటలకు, 10.20కి గోపాలపురం, 10.40 గంటలకు శింగరకొండపాలెం, కొత్తరెడ్డిపాలెం, 11 గంటలకు చినకొత్తపల్లి, శ్రీనివాసనగర్, 11.20కి గోవాడ, సాధునగర్, 11.40 గంటలకు కలవకూరు, గుర్రంవారిపాలెం, మధ్యాహ్నం 12 గంటలకు శంఖవరప్పాడు, 12.20కి ధర్మవరం, 12.40కి మైలవరం, ఏలేశ్వరవారిపాలెం, ఒంటి గంటకు ఉప్పలపాడు, 1.20కి వెంపరాల గ్రామాల నేతలు, కార్యకర్తలతో రవికుమార్ సమీక్ష నిర్వహించనున్నారు.

కాగా, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బుధవారం పలు గ్రామాలలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 8 గంటలకు సంతమాగులూరు, 8.30కి గొర్రెపాడు, 9కి కొమ్మినేనివారిపాలెం, 9.30కి బల్లికురవ, 10కి కొండాయపాలెంలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలి

- ఎస్పీ వకుల్ జిందాల్



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

రామాపురం(చీరాలటౌన్), మార్చి 26: సార్వత్రిక ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. మంగళవారం సమస్యాత్మక ప్రాంతాలైన రామాపురం, కటారిపాలెం గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. ఓటర్లకు రక్షణ కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే సిబ్బందికి అన్ని విధాలుగా మార్గదర్శకాలు అందజేసినట్లు చెప్పారు. ఓటర్లు వారి హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చునని చెప్పారు. ఎవరికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఎస్పీతో పాటు బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బ్రిజ్ కిషోర్‌నేగి, చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కోడ్‌ను పటిష్టంగా అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఫణీంద్రబాబు

చినగంజాం, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల్లో మోడల్ కోడ్ పటిష్టంగా అమలుచేయాలని తహసీల్దార్ ఫణీంద్రబాబు, ఎంపీడీవో వరప్రసాద్‌లు గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలను ఆదేశించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండి అనుమతి లేని ప్రకటనలు, ప్రచారాలు లేకుండా చూడాలన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలుపై మండల పరిధిలోని గ్రామ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వలంటీర్లను రాజకీయ ప్రసారాలకు దూరంగా ఉంచాలన్నారు. వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులు వాట్సాప్ గ్రూప్, ఫేస్‌బుక్‌ల్లో మీడియా ద్వారా ఎలాంటి ఏపార్టీకి సంబంధించిన ప్రచారాలు చేయరాదని చెప్పారు. గ్రామాల్లో అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఎంసీసీ అమలు పక్కాగా చేయాలని అన్నారు. సీవిజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదుల్ని తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. ఫిర్యాదులు రాకుండా ఎంసీసీ ఉల్లంఘనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో తాత్కాలిక పార్టీ కార్యాలయాలు ఏర్పాటుచేయాలన్నా, కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేయాలన్నా రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలని అన్నారు. సువిధ యాప్ ద్వారా అనుమతి పొందాలనే విషయాలపై గ్రామాల్లోని పార్టీ నాయకులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, ఆయా గ్రామాల వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్చకుడిపై వైసీపీ నేత దాడి హేయం

- కఠిన చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సంఘాల డిమాండ్

ఒంగోలు(కల్చరల్), మార్చి 26: కాకినాడ పెద్ద శివాలయంలో ఇద్దరు అర్చకులపై వైసీపీ నాయకుడు దాడి చేయటం అత్యంత హేయనీయమైన చర్యని, అతడిపై వెంటనే చర్య తీసుకుని అరెస్ట్ చేయాలని బ్రాహ్మణ సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం ఒంగోలులో లాయర్‌పేటలో రాష్ట్ర బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ టీవీ శ్రీరామమూర్తి, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ జిల్లా కోఆర్డినేటర్ కామరాజుగడ్డ కుసుమకుమారి ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అర్చకులను కాళ్లతో తన్ని భౌతిక దాడికి దిగిన వైసీపీ మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రశేఖర్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటువంటి దాడులు అనేకం జరిగినప్పటికీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. బ్రాహ్మణులకు రక్షణ కరువైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పొన్నలూరి శ్రీనివాసఫణి, ఆర్.శ్రీనివాస్, ఎస్ఏటీ.రాజేష్, యామిజాల ప్రసన్నకుమార్ శర్మ, ఎం. మారుతి, ఎస్.సుజాత, మురళి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లంకా ప్రసన్నకుమార్ అర్చకులపై దాడిని ఖండిస్తూ ఇటువంటివి పునరావృతం అయితే తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బ్రాహ్మణులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఈ విషయంలో బ్రాహ్మణులందరూ ఐక్యంగా ముందుకు కదలాలని పేర్కొన్నారు. అర్చకులపై వైసీపీ నాయకులు పదే పదే దాడులకు దిగటం, దేవాలయాలను ధ్వంసం చేయటం గత నాలుగున్నరేళ్లుగా పరిపాటిగా మారిందని మండిపడ్డారు. దాడిలో గాయపడిన అర్చకులకు తమ సంఘం తరపున సంఘీభావం ప్రకటిస్తున్నామని ప్రసన్న కుమార్ పేర్కొన్నారు.

అర్చకులపై దాడిని బ్రాహ్మణ సంక్షేమ సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రామరాజు మల్లిఖార్జున శర్మ, అడ్మిన్ ట్రస్టీ శివదేవుని మురళీధర శర్మ తీవ్రంగా ఖండించారు. ప్రతి ఒక్కరూ క్షేమంగా ఉండాలని ఆశీర్వదించే అర్చకులపై దాడికి పాల్పడటం దారుణమన్నారు. నిందితునిపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే ఇటువంటివి మళ్లీ జరగకుండా ఉంటాయన్నారు.

600 మంది భక్తులకు ఉచిత వైద్యసేవలు



భక్తులకు వైద్య సేవలు అందిస్తున్న ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు

అద్దంకి, మార్చి 26: శింగరకొండ 69వ వార్షిక తిరునాళ్లకు వచ్చిన భక్తులకు ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు నిర్విరామంగా ఉచిత వైద్యసేవలు అందించారు. అత్యవసర వైద్యంతో పాటు ప్రాథమిక వైద్యం, షుగర్, బీపీ పరీక్షలు చేశారు. సుమారు 600 మంది భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలిపారు. జనరల్ వైద్యులు డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, మేనేజర్ దాసరి సుధాకర్, రవి, నాగరాజు, స్వర్ణలత, కృష్ణవేణి, సునీత, మణికంఠలు పాల్గొన్నారు. ఉచిత వైద్య సేవలు అందించటం పట్ల దేవాలయం ఈవో సుభద్ర, భక్తులు అభినందించారు.

శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు

పంగులూరు, మార్చి 26: మండలంలోని జాగర్లమేడివారిపాలెం గ్రామంలో ఈ నెల 28న జరగనున్న శ్రీకోదండ రామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. వేద పండితులు మంగళవారం శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు రొంపిచర్ల వెంకట సత్యనారాణాచార్యులు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఓటు హక్కుపై అవగాహనా ర్యాలీ

యద్దనపూడి(మార్టూరు), మార్చి 26: యద్దనపూడి గ్రామంలో మంగళవారం ఓ టు హక్కు అవగాహనా సదస్సులో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అందరూ మొదట తమ ఓటు, పోలింగ్ బూత్ వివరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది



రాజుపాలెంలో తెరుచుకోని గ్రామ సచివాలయం

మార్టూరు, మార్చి 26: సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండ లంలోని రాజుపాలెం గ్రామ సచివాలయం మంగళవారం ఉదయం 10.50లకు కూడా తెరుచు కోలేదు. వరుసగా మూడు రోజులు శని, ఆది, సోమవారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు కావడంతో గ్రామ సచివాలయాలు తెరుచుకోలేదు. మంగళవారం సచివాలయాలు తెరుస్తారని వివిధ పనులు నిమిత్తం రాజుపాలెం గ్రామంలో కొంతమంది సచివాల యానికి వచ్చారు. ఉదయం 10.50 గంటలకు కూడా సచివాలయం తలుపులు తెరుచుకోకపోవడంతో మంగళవారం కూడా ఏమైనా సెలవు ఉందా అని గ్రామస్థులు ఆరా తీశారు. ఆతర్వాత ముగ్గురు గ్రామ సచివాలయ సిబ్బంది రావడంతో తలుపులు తెరుచుకున్నాయి. ఏది ఏమైనా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల సచివాలయాల్లో సమయపాలన సక్రమంగా పాటించడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

పర్చూరు బార్ అసోసియేషన్ కార్యవర్గం



శ్రీరమణి



షేక్ రేష్మ

పర్చూరు, మార్చి 26: పర్చూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ నియామకం మంగళవారం స్థానిక కోర్టు భవనాల సముదాయంలో నిర్వహించినట్లు ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా నరేంద్రకుమార్ తెలిపారు. అధ్యక్షురాలిగా చుండ్రు శ్రీరమణి, కార్యదర్శిగా షేక్ రేష్మ, కోశాధికారిగా దగ్గుబాటి రాఘవయ్య చౌదరి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యవర్గసభ్యులుగా కొల్లా నరేంద్రకుమార్, రావి శ్రీనివాసరావు, యార్లగడ్డ వెంకటేశ్వర్లు, చాగంటి సుబ్బారావు, కట్టా సాల్మన్, వెంగళశెట్టి తిరుములరావు నియమితులయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

పాఠశాలకు వితరణ

ఇంకొల్లు, మార్చి 26: తాటిపర్తివారిపాలెం ఎడ్యుకేటర్స్ గ్రూపు సభ్యులు మండలంలోని కొణికి నలతోటివారిపాలెంలోని ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం సుమారు రూ.45 వేల విలువ కలిగిన బల్లలను బహూకరించారు. గ్రూపు సభ్యులు పంది డేవిడ్, కాకి సామియేలు, కట్టా సురేష్, చెక్కా సంతోష్‌కుమార్ తదితరులు బల్లలు సమకూర్చేందుకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవరెడ్డి, గంగవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని నార్నె సమత, పంది సమర్పణరావు, ఆత్మకూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని ఆచూకీ లభ్యం

చినగంజాం, మార్చి 26: చినగంజాం ప్రాంతంలోని రొంపేరు బ్రిడ్జి సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆచూకీ లభ్యమైనట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మృతుడు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దుధమానియామండలం సిదార్ గ్రామానికి చెందిన దాల్ ప్రతాప్ సింగ్(30) అని తెలిపారు. ఎనిమిది నెలల క్రితం ప్రతాప్‌సింగ్ తన సోదరులు, గ్రామస్థులతో కలిసి తమిళనాడు రాష్ట్రంలో కూలి పనుల నిమిత్తం పరం కంపెనీకి వెళ్లినట్లు తెలిపారు. మూడు నెలల క్రితం మృతుడు మతిస్థిమితం లేక పని వద్ద నుండి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రంలో పనులు పూర్తి కావడంతో మృతుని అన్నదమ్ములు, గ్రామస్థులు వారి స్వగ్రామాలకు తిరిగి వెళ్లినట్లు తెలిపారు. చీరాల ఏరియా వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం వైద్యశాలలోనే మృతదేహాన్ని ఉంచినట్లు తెలిపారు. మృతుని కుటుంబసభ్యులు వస్తే వారికి మృతదేహాన్ని అప్పగించనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

చీరాలటౌన్, మార్చి 26: ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు గాయపడిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం మార్కెట్ సెంటర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తోటవారిపాలెంకు చెందిన ఆసాది సామ్రాజ్యం ఈపూరుపాలెం సెంటర్‌లో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో రోడ్డు దాటుతుంది. ఈక్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చీరాల ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు గుంటూరుకు తరలించారు. బాధితురాలి మనవడు విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు చెక్కుల చోరీ

మేదరమెట్ల, మార్చి 26: మండలంలోని అనమనమూరు పొలాల్లో ఉన్న పొగాకు చెక్కులను దొంగలు ఎత్తుకెళ్లారు. ఉదయం తొక్కి ఉంచిన చెక్కులను దొంగలు ఎత్తుకు వెళ్లారని మందా ఏసోబు మంగళవారం కొరిశపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హనుమారెడ్డికి చెందిన పొలాన్ని తీసుకుని సాగు చేసుకుంటున్నారు. సోమవారం ఉదయం చెక్కులు తొక్కి వచ్చి మరునాడు వెళ్ళిచూడగా లేవని కొరిశపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆటో బోల్తాపడి దంపతులకు తీవ్రగాయాలు

పంగులూరు, మార్చి 26: మండలంలోని ముప్పవరం - పంగులూరు గ్రామాల మధ్య మంగళవారం రాత్రి ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. తూర్పుతక్కెళ్ళపాడుకు చెందిన పాలపర్తి చిన్న, అతని భార్య మహాలక్ష్మి ముప్పవరం గ్రామ సమీపం పళ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజూలాగానే పళ్ళ వ్యాపారం ముగించుకుని తన ఆటోలో మిగిలిన పళ్ళు, కొబ్బరి బోండాలు వేసుకుని స్వగ్రామం బయలుదేరారు. ఆటో కోళ్ళఫారం సమీపంలో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లి పడిపోయింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం అద్దంకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.